

నేడు ప్రధాని మోదీ రాక

- రాజమహేంద్రవరం వేమగిరిలో కూటమి భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న పవన్, పురందేశ్వరి, లోకేశ్
- వేదిక, ఇతర ఏర్పాట్లు పూర్తి
- భారీ భద్రతా ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, మే5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. ఎన్‌డీఏ కూటమి భాగస్వాములుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ హాజరుకానున్నారు. 'విజయశంఖారావం' పేరుతో నిర్వహించే ఈ సభ 60 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. విశాలమైన సభావేదికలు ఏర్పాటు చేశారు. హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపం వరకూ హైవేకు రెండువైపులా బారికేడ్లు ఏర్పాటుచేశారు. వేమగిరి వైపు కూడా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసు భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తం ఈ ప్రాంతాన్ని ఎస్‌పీజీ స్వాధీనం చేసుకుంది. ప్రాంగణంలో 50 వేల మంది కూర్చోవడానికి కుర్చీలు వేస్తున్నారు. ప్రధానమంత్రి పాల్గొనే ఈ విజయశంఖారావం సభ వేదికపై మొత్తం 44 మంది ఆశీనులయ్యేటట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితోపాటు కాకినాడ, అమలాపురం, నర్సాపురం, ఏలూరు పార్లమెంటు అభ్యర్థులకు కూడా స్థానం కల్పించనున్నారు. వారితోపాటు ముఖ్యంగా రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులకు చోటు కల్పించనున్నారు. ఇంకా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ముఖ్య నేతలకు కూడా అవకాశం కల్పిస్తారు.



వేమగిరిలో మోదీ పాల్గొనే సభా వేదిక ఏర్పాట్లు

ప్రధాని రాక ఇలా..

ప్రధాని నరేంద్రమోదీ సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట 35 నిమిషాలకు ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ ఎయిర్‌పోర్టు నుంచి ఐఏఎఫ్ ఎంబ్రేయర్ మీద బయలుదేరి 2.25 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.30 గంటలకు ఎం.ఐ 17 హెలికాప్టర్ మీద 2.50 గంటలకు వేమగిరిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు వస్తారు. అక్కడ నుంచి 2.55 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3 గంటలకు సభావేదిక వద్దకు వస్తారు. అక్కడ 3 గంటల నుంచి 3.45 గంటల వరకూ అంటే మొత్తం 45 నిమిషాలపాటు వేదిక మీద ఉంటారు. 3.45కు బయలుదేరి రోడ్డు మార్గాన 3.55 గంటలకు హెలిపాడ్‌కు చేరుకుంటారు. హెలికాప్టర్‌లో అనకాపల్లి వెళతారు.



జయం మనదే..

తుని సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ఓడిపోతామని తెలిసే వైసీపీ దాడులు

- కల్తీకి కేరాఫ్‌గా మారిన మంత్రి
- మట్టి, ఇసుక మాఫియాకు రాజా
- హేచరీకి రూ.10 లక్షల మామూళ్లు
- విలేకరిని హత్య చేయించారు
- రానున్నది కూటమి ప్రభుత్వమే
- జనసంద్రంగా మారిన తుని


ఫ్యాన్ గాలి తీసేయండి : సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

తుని రూరల్, మే 5 : కల్తీకి కేరాఫ్‌గా మారిన ఘనత తునికి చెందిన వైసీపీ మంత్రి దాడిశెట్టి రాజాకే దక్కిందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శించారు. కూటమి ఉమ్మడి అభ్యర్థుల ప్రచారంలో భాగంగా తుని పట్టణం గొల్ల అప్పారావు సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని, ఓడిపోతామని తెలిసే వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్యలకు మంత్రి దాడిశెట్టి రాజా పాల్పడ్డారని, పత్రికా స్వేచ్ఛను హరించి ఓ పత్రికా విలేకరిని దారుణంగా హత్య చేయించారన్నారు. తాండవ నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వి తరలించి సముద్ర తీరాన సముద్రపు ఇసుకను కలిపి కల్తీ ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. తీర ప్రాంతాల్లో రాష్ట్రానికి ఆదాయ వనరులుగా మారిన హేచరీల నుంచి రూ.10 లక్షలు మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సాగునీటి కాల్వలు గాలికి వదిలేసి రైతులను దెబ్బతీశారని ధ్వజమెత్తారు.తునిలో ప్రధాన సమస్య తాండవ రిటైనింగ్ వాల్ ఊసే లేదని, మట్టి మాఫియా నడిపిస్తూ కోట్ల రూపాయలు దండుకోవడమే మంత్రి పనిగా పెట్టుకున్నారన్నారు. మంత్రి ఇలాకాలోనే రోడ్లు దయనీయంగా మారాయని, మిగతాచోట్ల పరిస్థితి చెప్పనక్కరలేదన్నారు. తునిలో సమస్యలు పరిష్కారం అవ్వాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్న దివీస్ పరిశ్రమ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, మత్స్యకారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. దివీస్ సమస్యపై గతంలో తొండంగి మండలంలో పర్యటించి వారికి అండగా నిలిచినట్టు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాలుష్య రహిత పరిశ్రమల పనిపడతామన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం అభివృద్ధి చేస్తామన్నారు. పంపా, తాండవ రిజర్వాయర్లకు సంబంధించిన పంట కాల్వలు ఆధునికీకరించి రైతులను ఆదుకుంటామన్నారు. తుని రైల్వేస్టేషన్‌లో లోకల్ ట్రైన్స్ హాల్ట్‌కు చొరవ చూపి ఈ ప్రాంత వాసుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తుని అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటామని రానున్న ఎన్నికల్లో సైకిల్, గాజు గ్లాసు గుర్తులపై అమూల్యమైన ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంట సంక్షేమం వెల్లివిరుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. ముందుగా చామవరం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభ వేదిక వరకూ రోడ్ నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, తుని అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత, సుర్ల లోవరాజు, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, మోతుకూరి వెంకటేష్, యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు వీరేష్, చోడిశెట్టి గణేష్, బీజేపీ నేత చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొన్నారు.


వీరికే ఓటేయండి : కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్, తుని ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితను పరిచయం చేస్తున్న పవన్



పవన్‌ను కలిసిన ముద్రగడ కుమార్తె


తుని రూరల్ : తునిలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి, చందు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పవన్‌కల్యాణ్‌పై ముద్రగడ పద్మనాభం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జనసేనానికి మద్దతుగా మాట్లాడిన విషయం విదితమే. దీంతో వీరి కలయిక చర్చనీయాంశమైంది.


పవర్ స్టార్.. ప్రభంజనం : తునిలో జరిగిన పవన్ సభకు హాజరైన యువత

గాలి వీస్తోంది!

కూటమి వైపే 'గోదారి' పవనాలు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)



- అధినేతల చూపంతా ఇక్కడే
- గోదావరి జిల్లాలను జల్లెడ పడుతున్న పార్టీలు
- రోజూ ఏదొక అధినేత ఈ జిల్లాల్లోనే పర్యటన
- టీడీపీ అధినేత చంద్రబాబు సుడిగాలి పర్యటనలు.. దూకుడు పెంచేలా వ్యూహాలు
- జనసేన అధినేత సైతం ఉమ్మడి జిల్లాపైనే దృష్టి
- అన్ని నియోజకవర్గాలనూ చుట్టేస్తున్న పవన్
- పిఠాపురంలో బరిలోనూ 'వారాహి' స్పీడు
- రాజమండ్రి ఎంపీ బరి నుంచి పురందేశ్వరి
- రాష్ట్ర అధ్యక్షురాలిగానూ దిశానిర్దేశం
- కూటమి అభ్యర్థుల జోరుతో వైసీపీ డీలా
- ఇప్పటికే జగన్ పర్యటించినా కలసిరాని వైనం
- మోదీ సభతో ఇక 'విజయశంఖారావమే'

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు అనూహ్యమైన తీర్పు ఇవ్వబోతున్నట్టు గోదావరి తీరంలోని జనంనాడి చెబుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైపు గాలి వీస్తుండడంతో ఆయా పార్టీల్లో జోష్ పెరిగింది. 2019లో ఇక్కడ వైసీపీ ఫ్యాన్ గాలితో దూసుకెళ్లింది. ఈసారి గోదావరిలో సహజమైన గాలి వీస్తోంది. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అస్తవ్యస్త విధానాలు, అవినీతి, అరాచకం, శాంతిభద్రతలు మృగ్యంకావడం, వేధింపు ధోరణులు, ప్రకృతి వనరుల దోపిడీ.. అభివృద్ధి లేకపోవడం, నిరుద్యోగం.. ఇలా సవాలక్ష సమస్యల్లో జనం చిక్కుకుపోయారు. అసలు పథకాలన్నీ మూలనపడేసి, కొన్ని సంక్షేమాల పథకాల పేరిట బటన్ నొక్కినా, అవి ప్రజలకు ఎప్పుడు చేరతాయో కూడా తెలియని గందరగోళం మధ్య ఐదేళ్లు గడిచింది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి.. సామాన్య మధ్యతరగతి ప్రజల జీవనం కూడా దుర్భరమైన స్థితిని చవిచూశారు. కరెంటు చార్జీలు, పన్నుల పేరిట సాగించిన ప్రభుత్వం అన్ని వర్గాలపై ఎనలేని భారం మోపింది. నరకప్రాయమైన రోడ్లు, అభివృద్ధి లేమితో ప్రజలు పడినపాట్లు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలో అభివృద్ధి అనేది ఎక్కడా ప్రచారం చేసుకోలేని దుస్థితిలో వైసీపీ ఉంది. ఈసారి సంక్షేమం అనే ఒక్క మాటనే పదేపదే వల్లెవేస్తూ జగన్ బటన్ నొక్కిన కార్యక్రమాన్ని ప్రచారం చేస్తోంది. మరోవైపు ఆ పార్టీ మేనిఫెస్టో కూడా తుస్సుమనడంతో కేడర్ మరింత డీలా పడింది. ఇటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి గోదావరి జిల్లాల్లో జనం బ్రహ్మరథం పడుతుండడం వైసీపీ నేతల్లో వణుకుపుట్టిస్తోంది. శాంతిభద్రతలు కాపాడడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన ప్రజామేనిఫెస్టోను కూటమి విడుదల చేయడంతో మంచి స్పందన వచ్చింది. మరోవైపు టీడీపీకి కంచుకోటలాంటి గోదావరి జిల్లాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మొదటి నుంచి ప్రత్యేక దృష్టి పెట్టారు. వైసీపీ కుట్ర వల్ల చంద్రబాబు 53 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా మగ్గిపోయిన సమయంలో ఆయన కుటుంబ సభ్యులంతా రాజమహేంద్రవరంలోనే మకాం ఉండి ప్రజలతో కలసి ఉండిపోయారు. చంద్రబాబుకు ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభించడంతోపాటు ఆయన గొప్పతనం ప్రజలకు బాగా అర్థమైంది. అంతకుముందే గత ఏడాది మే నెలలో రాష్ట్ర స్థాయి టీడీపీ మహానాడును ఇక్కడే నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలనూ ఇక్కడి నుంచే ప్రకటించారు. మహానాడు కూడా గోదావరి జిల్లాల్లో మరింత జోష్‌ను పెంచింది. టీడీపీ-జనసేన పొత్తు కూడా రాజమహేంద్రవరంలోనే పొడవడం, నేరుగా పవన్‌కల్యాణ్ ఇక్కడి నుంచే ప్రకటించడమేగాకుండా తొలి భేటీ కూడా ఇక్కడే నిర్వహించడం రాజకీయ సంచలనాలకు దారితీసిందనే చెప్పాలి. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు గోదావరి జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నికల ప్రకటన తర్వాత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రధానంగా గోదావరి జిల్లాలపైనే దృష్టి పెట్టారు. గోదావరి జిల్లాల్లో గాలి ఎటుంటే అదే పార్టీ అధికారంలోకి వస్తుందనేది ఎన్నోసార్లు రుజువైంది. దీంతో గోదావరి జిల్లాల్లో గెలుపే ప్రధానంగా ఇటు కూటమి, అటు వైసీపీ కూడా సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్నాయి. ప్రతిరోజూ ఏదొక అధినేత గోదావరి జిల్లాల్లో పర్యటిస్తుండడమే దీనికి ఉదాహరణ. సీట్ల కేటాయింపులో టీడీపీ, జనసేన మధ్య కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడినా.. ఊహించని విధంగా ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఈ రెండు పార్టీల కేడర్లు ఎంతో పట్టుదలగా కలసి పనిచేస్తున్నాయి. గత ఎన్నికల్లో జనసేన కూడా గోదావరి జిల్లాల్లో గణనీయమైన ఓటుబ్యాంకును సాధించుకోవడంతో ఇప్పుడు కూటమికి మరింత బలం చేకూరిందని టీడీపీ, జనసేన అభ్యర్థులు గణాంకాలతో సహా చెబుతున్నారు. మరో రెండు ఆసక్తికరమైన అంశాలు ఏమంటే.. రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ, జనసేన అధినేతలు పురందేశ్వరి, పవన్‌కల్యాణ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే పోటీ చేస్తుండడం ఈ ప్రాంతంలో ప్రభావితం చూపుతుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా పిఠాపురం నుంచి పోటీచేస్తున్న పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గంతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరిని ప్రభావితం చేసేలా పూర్తిస్థాయిలో తన పర్యటనలను రూపొందించుకోవడం వ్యూహాత్మకమే. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్.. గోదావరి జిల్లాల ఫలితాలను పూర్తి స్థాయిలో ప్రభావితం చేసేలా ఎన్నికల ప్రచారాలను సాగిస్తున్నారని ఆ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విజయావకాశాలపైనా అందరి దృష్టి ఉంది. ఆమె తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులతో కలసి పెద్దఎత్తున ప్రచారం సాగిస్తూ విజయానికి చేరువవుతున్నారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగానూ ఇక్కడి నుంచే దిశానిర్దేశం చేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా రాజకీయ ఉద్దండులంతా గోదావరి జిల్లాలపై పూర్తిగా దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది. వైసీపీ అధినేత జగన్ కూడా ఎక్కువసార్లు గోదావరి జిల్లాల్లో పర్యటించే విధంగానే తన రూటు మ్యాప్‌ను రూపొందించుకుంటున్నారు. బస్సు యాత్ర ద్వారా, తర్వాత అంబాజీపేటలో ఎన్నికల ప్రచారానికి ఇప్పటిదాకా రాగా, ఆయా జగన్ సభలు అనుకున్నవిధంగా విజయవంతంకాకపోవడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 7న కోరుకొండలో ఎన్నికల ప్రచారసభ కోసం మరోసారి జగన్ రాబోతున్నారు. మొత్తానికి వైసీపీ గోదావరి జిల్లాల్లో ఈసారి వ్యతిరేక పవనాలు వీస్తుండడం వైసీపీ అభ్యర్థులను కలవరానికి గురిచేస్తోంది. ఎన్‌డీఏ కూటమి తరఫున ప్రచారానికి సోమవారం రాజమహేంద్రవరం వస్తున్న ప్రధాని మోదీ విజయశంఖారావం పూరించి.. దూకుడు పెంచనున్నారు.

రేపు కోరుకొండలో సీఎం జగన్ పర్యటన
5

హీరో సాయిధరమ్ తేజ్‌పై పిఠాపురంలో దాడి
- మెయిన్‌లో..


అభ్యర్థితో.. ఒకరోజు

ఉదయం కుటుంబీకులతో మాట్లాడుతున్న వాసు

12 గంటలపాటు జనంతోనే..


ఇక్కడ ఓటేయండి : నమూనా ఈవీఎం చూపుతున్న అభ్యర్థి ఆదిరెడ్డి వాసు

రోజుకు 24 గంటలు కాదు.. 48 గంటలైనా సరిపోదేమో.. ఎన్నికల సమయం దగ్గరపడడంతో అభ్యర్థులు అంత బిజీబిజీగా ఉంటున్నారు. ఎన్నికల వేళ అసలు అభ్యర్థులేం చేస్తారు.. వారి షెడ్యూల్ ఎలా ఉంటుందనే దానిపై అందరికీ ఆసక్తే.. దీనిలో భాగంగానే రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసుతో ఆదివారం ఆంధ్రజ్యోతి **అభ్యర్థితో ఒకరోజు** నిర్వహించగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఊపిరిసలపనంత బిజీబిజీగా గడిపారు.. ప్రచారంలోనే టిఫిన్.. ప్రచారంలోనే భోజనం.. రాత్రికి అంతే..! ఉదయం 5 గంటలకు లేచిన ఆయన కాసేపు వ్యాయామం చేశారు.. ఆ తరువాత అరగంటలో కాలకృత్యాలు తీర్చుకుని 6 గంటలకు బయటకు వచ్చారు.. కాసేపు కుటుంబీకులతో మాట్లాడి.. 6.30 గంటలకు బయటకు వచ్చారు.. అప్పటికే వేచి ఉన్న ప్రజలతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు ఆరంభించిన ప్రచారం రాత్రి 9 గంటల వరకూ సాగుతూనే ఉంది.. గత రెండు నెలలుగా ఇదే షెడ్యూల్. - వివరాలు 5వ పేజీలో

ఇసుకను ఉచితంగా అందుబాటులోకి తెస్తాం..

- పేదింటికి ఇబ్బంది లేకుండా చూస్తాం
- ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- పలువురు వైసీపీ నాయకులు చేరిక
- కూటమి రాజానగరం అభ్యర్థి బత్తుల


పార్టీలో చేరిన వారికి జనసేన కండువాలు కప్పుతున్న కూటమి రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, మే 5 : సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉంచేందుకు ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. సీతానగరం మండలంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడారు. ఇసుక అందక పేదల ఇళ్లన్నీ నిలిచిపోయాయని.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ఉచిత ఇసుక అందుబాటులోకి తెస్తామన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని ఉంటుందని..పేదింటికి ఇసుక ఇబ్బంది ఉండదని తెలిపారు.రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కూటమితోనే సాధ్యమన్నారు.మహిళలకు 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. రాజానగరం నియోజకవర్గం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం వద్ద కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలోయర్రంశెట్టి శ్రీను, బుంగా స్టాలిన్,అప్పిరెడ్డినాగేశ్వరావు,జంగిలి సూర్యనారాయణ, రాజానగరం మం డలం సూర్యారావుపేట గ్రామం దళితవాడకు చెందిన మరో 30 మంది జనసేనలో చేరారు. సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామానికి చెందిన వెదుళమ్మ చెరు వు వద్ద గల 50 కుటుంబాలు వైసీపీని వీడి యువజన నాయకుడు తోట పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరారు.వీరందరికీ పవన్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, యువజన నాయకుడు తోట పవన్‌కుమార్, కుమార్తె బత్తుల వందనాంబిక ఆదివారం సీతానగరం మండలం వెదుళ్ళపల్లి, రాజంపేట, కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామాల్లో వేర్వేరుగా ఇంటింటా ప్రచారం చేశారు.ప్రతి ఇంటికి వెళ్లి గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి బలరామకృష్ణను గెలిపించాలని కోరారు.ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు.సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


మీ వెంటే : తోట పవన్ సమక్షంలో పార్టీలో చేరికలు


నా ఓటు మీకేనమ్మా : బత్తుల వెంకటలక్ష్మితో వృద్ధుడు


నువ్వు రావాలయ్యా : బత్తులకు ప్రచారంలో జన హారతి

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
సోమవారం 6 మే 2024 4

మహిళలపై నేరాల నియంత్రణకు
ప్రత్యేకంగా రాజమండ్రి రక్షాదళం

డిక్లరేషన్ ఆవిష్కరించిన పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు



డిక్లరేషన్ ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి, వాసు, నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మే 5: మహిళలపై నేరాల నియంత్రణకు సంబంధించి మేనిఫెస్టోలో ప్రత్యేకంగా రూపొందించిన రాజమండ్రి రక్షాదళం డిక్లరేషన్‌ను బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, తెలుగుదేశం పార్టీ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఆవిష్కరించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో ఈ మేరకు డిక్లరేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ మహిళల రక్షణ తమ బాధ్యత అని అన్నారు. వైసీపీ పాలనలో మహిళలపై అత్యాచారాలు, దాడులు ఎక్కువయ్యాయని చెప్పారు. రాజమహేంద్రవరం సిటీలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను పెంచి పోషిస్తున్నది ఎవరో అందరికీ తెలుసని అన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పాలన మారితేనే అరాచకాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, నేరాల నియంత్రణలో భాగంగా దశలవారీగా సిటీలో 7,500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎక్కువగా నేరాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా రాజమండ్రి రక్షాదళం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు ఆదిరెడ్డి అప్పారావు, సోము వీర్రాజు, టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, జనసేన నాయకుడు అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నగర ఇన్‌చార్జి యెనుముల రంగబాబు, రేలంగి శ్రీదేవి, మాజీ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణ, వీరన్న చౌదరి, ఇతర నాయకులు పాల్గొన్నారు. పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు రాజమహేంద్రవరం సిటీలోని రాజస్థానీలు, గుజరాతీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



ఇంద్రభవనాన్ని తలపిస్తున్న వైసీపీ కార్యాలయం





స్థలాలు చూపకపోవడంతో గుడారాల్లోనే పేదల నివాసం

వైసీపీ కోసం
ఇంద్రభవనం

జనాలకు మాత్రం జగనన్న గుడారాలు
రాజమహేంద్రవరంలో వైసీపీ కార్యాలయం రాజ భవనమే..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి): పై ఫొటోలో మీరు చూస్తోంది మహారాజుల ప్యాలెస్ కాదు. వైసీపీ పార్టీ కార్యాలయం. రెండో ఫొటోలో చూస్తోంది ఎడారిలో డేరాలు కాదు.. సిటీలో పేదల గుడారాలు. వైసీపీ పాలనలో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందనడానికి ఇవే ప్రత్యక్ష సాక్ష్యాలు. జగనన్న కాలనీల పేరిట పేదవర్గాల్లో ఎన్నో ఆశలు పుట్టించారు. ఎందుకూ పనికిరాని భూముల్లోను, నివాస ప్రాంతాలకు కిలోమీటర్ల దూరంలోనూ కొందరికి స్థలాలిచ్చారు. ఈ ఐదేళ్లలో ఆ భూముల్లో పేదల ఇళ్లకు పునాదులు కూడా పడలేదు. కానీ చాలామందికి పట్టాలు తప్ప స్థలం కేటాయించిందీ లేదు. పేదల ఇళ్ల కోసం స్థలాల సేకరణ అంటూ వందల కోట్ల రూపాయలు మాత్రం వైసీపీ నాయకులు జేబులో వేసుకున్నారు. ఇక అసలు విషయానికొస్తే.. ఇటీవల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు తూర్పుగోదావరిలోని రాజమండ్రి అర్బన్, రూరల్‌లోని పేదలకు రాజానగరం నియోజకవర్గంలోని పలు మండలాల్లో స్థలాలను కేటాయించామంటూ వైసీపీ నాయకులు ఆర్భాటంగా పట్టాలు పంపిణీ చేశారు. అయితే చేతిలో పట్టా పెట్టారేగానీ ఈరోజుకీ స్థలాలు చూపించలేదు. దీంతో పేదలు గుడారాల్లోనే మగ్గిపోతున్నారు. స్థానిక క్వారీ మార్కెట్ ఏరియాలోని పేదలకు రెండు నెలల కిందట ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కానీ వారికి ఈనాటికీ స్థలాలు చూపించలేదు. వాళ్లకు ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత కూడా లేకపోవడంతో ఖాళీ స్థలాల్లోకి వెళ్లినా మళ్లీ గుడారాల బతుకులేనంటూ ఆ పేదలు వాపోతున్నారు.

- ఐదేళ్ల నుంచీ పేదలకు గూడు కల్పించలేని వైసీపీ పాలకులు తమ పార్టీ కార్యాలయాలకు మాత్రం ఇంద్రభవనాలు నిర్మించుకుంటున్నారు. పేదలకు ఇళ్లు తర్వాత సంగతి.. ప్రతి జిల్లాకు ఇంద్రభవనంలా పార్టీ కార్యాలయం నిర్మించాలనే జగన్ ఆలోచనతో తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని వైసీపీ.. తమ పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని రూ.2 కోట్ల అంచనా వ్యయంతో కేవలం మూడు నెలల కిందట ప్రారంభించారు. సుమారు రెండు ఎకరాల ఆర్అండ్‌బీ స్థలంలో శరవేగంగా 90 శాతం పనులు పూర్తిచేశారు. ఈ స్థలం రాజమహేంద్రవరంలో అత్యంత ఖరీదైన ప్రాంతమైన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, ఆర్ట్స్ కళాశాల చెంతన ఉంది. ఇక్కడ బహిరంగ మార్కెట్లో గజం లక్షపైనే ఉంది.. ఎకరం రూ.50 కోట్ల దాకా ఉంటుంది. అంటే రూ.100 కోట్లు ఉంటుంది. నామమాత్ర లీజు ప్రాతిపదికన కేబినెట్‌లో ఆమోదం పొంది ఈ నిర్మాణం చేస్తున్నారు. పక్కనే ఆర్ట్స్ కాలేజీలో హెలిప్యాడ్ కూడా అందుబాటులో ఉండేలా ఈ భవన నిర్మాణ స్థలాన్ని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఐదేళ్లలో పేదల సొంతింటి కల తీర్చడం చేతగాని జగన్.. పార్టీకి మాత్రం కోట్లు ఖర్చుపెట్టి ప్యాలెస్‌ని కట్టుకున్నారంటూ జనం నివ్వెరపోతున్నారు.



నేమ్ బోర్డు బహూకరణ

ఆయన పేరు దాట్ల బాబు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కూటమి అభ్యర్థులకు ముందస్తుగానే ఎంపీ, ఎమ్మెల్యే నేమ్ బోర్డులను అందజేశారు. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు ఎంపీ నేమ్‌బోర్డు, ఎమ్మెల్యే అభ్యర్థులు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, దాట్ల సుబ్బరాజు, వాసంశెట్టి సుభాష్‌లకు ఎమ్మెల్యే నేమ్ బోర్డులు అందజేశారు. వారంతా గెలవడం ఖాయమని తన నమ్మకమని ఆయన చెబుతున్నారు.

- అమలాపురం టౌన్



జానీ మాస్టర్ ప్రచారం

అంబాజీపేట, మే 5: ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రముఖ సినీ డ్యాన్స్ మాస్టర్ జానీ మాస్టర్ అన్నారు. పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల ప్రచారంలో స్టార్ క్యాంపెయినర్‌గా ఆయన పాల్గొని గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జానీ మాస్టర్‌తో ఫొటోలు తీసుకునేందుకు కూటమి శ్రేణులు ఉత్సాహం కనబరిచారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు తాయిలాలు





సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రకరకాల తాయిలాలు అందిస్తున్నారు. కుల సంఘాల సమావేశాలు నిర్వహిస్తూ పసందైన భోజనాలు పెడుతూ చిరు కానుకలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ పోస్టల్ బ్యాలెట్లపై దృష్టిపెట్టింది. కొత్తపేట అసెంబ్లీ పరిధిలో 1,993 పోస్టల్ బ్యాలెట్‌లు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన వారు తమ అభ్యర్థికే ఓటేయాలంటూ 25 గ్రాములతో తయారు చేయించిన సిల్వర్ కాయిన్లను పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు కానుకగా అందించినట్టు సమాచారం.

- ఆత్రేయపురం

ఓటర్లలో వారిదే పైచేయి..పోటీలో మాత్రం వెనుకంజ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇదీ పరిస్థితి
ఏడు అసెంబ్లీ స్థానాలకు బరిలో ఎనిమిది మందే మహిళలు

అమలాపురం రూరల్, మే 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 13,181 మంది ఎక్కువ ఉన్నారు. అయితే అమలాపురం లోక్‌సభ స్థానంతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేది కేవలం ఎనిమిది మంది మహిళలు మాత్రమే. అమలాపురం అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 15,31,410 మంది ఓటర్లు ఉండగా మహిళలు 7,72,285 మంది, పురుషులు 7,59,104 మంది ఉన్నారు. ఈ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ఒక్క మహిళా అభ్యర్థి కూడా లేకపోవడం విశేషం. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ తరఫున బూసిం రమణమ్మ నామినేషన్ దాఖలు చేసినప్పటికీ చివరి రోజు ఆమె ఉపసంహరించుకున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 91 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ఎనిమిది మంది పోటీలో ఉన్నారు. మండపేట, పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల నుంచి ఒక్క మహిళా అభ్యర్థి కూడా పోటీలో లేరు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి అయితాబత్తుల సుభాషిణి (కాంగ్రెస్), బొజ్జా ఐశ్వర్య (లిబరేషన్ కాంగ్రెస్), రామచంద్రపురం నుంచి 13 మంది బరిలో ఉండగా చెక్కా సుజాత (స్వతంత్ర), ముమ్మిడివరం నుంచి 15 మంది పోటీలో ఉండగా ఆర్.మహాలక్ష్మి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), అంగాడి రేవతి (స్వతంత్ర), కొత్తపేట నుంచి 13 మంది బరిలో ఉండగా సుంకర లక్ష్మీమణికుమారి (స్వతంత్ర) రాజోలు నుంచి 10 మంది పోటీలో ఉండగా పులపకూర లిలినీఆశారాణి (బీఎస్పీ), పోతుమూడి అలివేలుమంగతాయారు (స్వతంత్ర) పోటీలో ఉన్నారు. ఓటర్లుగా ముందున్న మహిళలు అభ్యర్థులుగా పోటీ చేయడంలో వెనుకబడిపోయారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఉన్న మహిళలు 7,72,285 మంది అయినప్పటికీ వారి ప్రాతినిధ్యం పెద్దగా లేకపోవడం చర్చనీయాంశమైంది.



బూట్ పాలిష్ చేసిన నల్లమిల్లి

అనపర్తి, మే 5: అనపర్తి ప్రచారంలో పాల్గొన్న ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్థానిక మెయిన్ రోడ్డులో చెప్పుల దుకాణంలోకి వెళ్లి బూట్ పాలిష్ చేశారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది.



ఎస్‌బీపీ పట్టాభిరామారావు



సంగిత వెంకటరెడ్డి



బి.కమలాదేవి



వల్లూరి నారాయణరావు



వీవీఎస్ఎస్ చౌదరి



బిక్కిన కృష్ణార్జునచౌదరి



వేగుళ్ల జోగేశ్వరరావు

నియోజకవర్గ మార్పులు
కచ్చితమైన తీర్పులు

విలక్షణం..విభిన్నం.. మండపేట నియోజకవర్గం




● (మండపేట)

రాష్ట్రంలోనే ఆర్థిక, సామాజిక అంశాల ప్రభావం అధికంగా ఉండే పారిశ్రామిక వాడ లాంటి ప్రాంతం మండపేట. వ్యవసాయం, వ్యాపారం కలగలిసిన విభిన్న నియోజకవర్గం. రైస్‌మిల్లులు అదనపు ప్రత్యేకత. ఎందుకంటే రాష్ట్రంలోనే అత్యధిక రైస్ మిల్లులు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఆంధ్రా శబరిమలైగా పేరుగాంచిన ద్వారపూడి ఇక్కడే ఉంది..



మండపేటలో రైస్‌మిల్లులు, కోళ్ల పరిశ్రమలతో పాటు, ఆయిల్ పరిశ్రమలు పేపరు మిల్లులు ఉన్నాయి. ఇక్కడ పరిశ్రమల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రైస్ మిల్లుల పరిశ్రమలు ఉన్న ప్రాంతం మండపేట, ద్వారపూడి.. అలాగే కేశవరంలో కోకోకోలా ఫ్యాక్టరీ ఉంది. పాడి పంటలకు, కోళ్ల ఫారాలకు మండపేట నెలవు. పశు పోషణలో కూడా పేరుగాంచింది ఈ ప్రాంతం. ఆంధ్రా హరియాణాగా మండపేటకు పేరుంది. ద్వారపూడిలో వస్త్ర వ్యాపారం ప్రముఖమైనది. ప్రఖ్యాతగాంచిన అయ్యప్ప ఆలయం ఇక్కడే ఉంది.



పామర్రు..ఆలమూరు..మండపేట

పూర్వం పామర్రు నియోజకవర్గం నుంచి ఆలమూరుగా ఆలమూరు నుంచి మండపేట నియోజకవర్గంగా రూపాంతరం చెందింది ఈ నియోజకవర్గం. 1978లో ఆలమూరుగా, 2009లో మండపేట నియోజకవర్గంగా ఏర్పడింది. 1952 నుంచి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఏడు సార్లు కాంగ్రెస్, ఆరుసార్లు టీడీపీ, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. కపిలేశ్వరపురం జమిందార్ ఎస్‌బీబీపీపీ పట్టాభి రామారావు(కాంగ్రెస్) 1952, 1955, 1962లో జరిగిన ఎన్నికల్లో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. అనంతరం సంగిత వెంకటరెడ్డి (కాంగ్రెస్) మూడు సార్లు విజయం సాధించారు. అలాగే వల్లూరి నారాయణరావు(టీడీపీ), వీవీఎస్ఎస్ చౌదరి (టీడీపీ) రెండేసి సార్లు, వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా మండపేట నుంచి టీడీపీ తరఫున మూడు సార్లు విజయం సాధించారు. బి.కమలాదేవి (కాంగ్రెస్), బిక్కిన కృష్ణార్జునచౌదరి (కాంగ్రెస్) నుంచి ఒక్కో దఫా గెలుపొందారు.

మండపేటలో మొత్తం 223 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ 91 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,17,647 మంది ఉన్నారు. వారిలో పురుషులు, 1,05,949 మంది మహిళలు 1,11,692 మంది ఉన్నారు. ఇతరులు నలుగురు ఉన్నారు.

జిల్లా నుంచి తొలి మంత్రి..

జిల్లా నుంచి తొలి మంత్రిగా కేబినెట్‌లో చోటు దక్కించుకున్న ఘనత కపిలేశ్వరపురం జమిందార్‌గా పిలువబడే ఎస్‌బీబీపీపీ పట్టాభిరామారావుకు దక్కింది. 1952,1955, 1962లో ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. అయితే జమిందార్ కుటుంబాన్ని ఓడించిన ఘనత సంగిత వెంకటరెడ్డి(చిన్నకాపు)కే దక్కుతుంది. వెంకటరెడ్డి రాష్ట్ర మంత్రిగా 1978, 1981, 1989, 1991, 1993 సంవత్సరాలలో ఆలమూరు నియోజకవర్గం నుంచి మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, నేదురుమల్లి జనార్దనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో వివిధ శాఖలను నిర్వర్తించారు.

టీడీపీకి కంచుకోటగా..

2009లో నియోజకవర్గ పునర్విభజన జరిగింది. మండపేట అర్బన్, మండపేట రూరల్, కపిలేశ్వరపురం మండలం, రాయవరం మండలాలతో మండపేట నియోజకవర్గం ఆవిర్భవించింది. అప్పటినుంచి ఇక్కడ జరిగిన మూడు ఎన్నికల్లో కూడా టీడీపీ తరఫున పోటీ చేసిన వేగుళ్ల జోగేశ్వరరావు వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. ఆయన నాలుగో సారి మండపేట నుంచి బరిలో నిలిచి వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుతో తలపడుతున్నారు. తొలిసారి 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన వేగుళ్ల జోగేశ్వరరావు సమీప ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి వీవీఎస్ఎస్ చౌదరిపై 17,440 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. 2014లో టీడీపీ తరఫున రెండోసారి బరిలో నిలిచిన వేగుళ్ల తన సమీప వైసీపీ అభ్యర్థి గిరిజాల స్వామినాయుడుపై 36,014 ఓట్లతో విజయం సాధించారు. మూడోసారి 2019లో టీడీపీ తరఫున బరిలో నిలిచిన వేగుళ్ల సమీప వైసీపీ అభ్యర్థి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌పై 10,600 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే వేగుళ్ల ఐదోసారి టీడీపీ తరఫున బరిలోకి దిగి సమీప వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుపై పోటీ చేస్తున్నారు.



పామర్రు రాజకీయ చరితం

1952లో పామర్రు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎస్‌బీబీపీ పట్టాభిరామారావు గెలుపొందారు. తొలి ఎమ్మెల్యేగా జమిందార్ సేవలందించారు. 1955లో జరిగిన ఎన్నికల్లో పట్టాభిరామారావు రెండోసారి విజయం సాధించారు. 1962లో పోటీ చేసిన పట్టాభిరామారావు స్వతంత్ర అభ్యరి ఎం.వీరన్నపై 12,258 ఓట్లు సాధించి వరుసగా మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1967లో సంగిత వెంకటరెడ్డి పట్టాభిరామారావు దూకుడుకు బ్రేక్ వేశారు. కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన పట్టాభిరామారావుపై స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న సంగిత వెంకటరెడ్డి పోటీ చేసి పట్టాభిరామారావుపై 2712 ఓట్లతో విజయం సాధించారు. జమిందార్ గెలుపునకు బ్రేక్ వేసిన నేతగా సంగిత రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన జి.కమలాదేవి సమీప స్వతంత్ర అభ్యర్థి టి.సూరపురెడ్డిపై 16,968 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. పామర్రు నియోజకవర్గానికి ఐదు విడతలు ఎన్నికలు జరగ్గా నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.

ఆలమూరు ఆవిర్భావం

1978లో పామర్రు నియోజకవర్గంలో ఉండే ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలతో పాటు అనపర్తి నియోజకవర్గంలో ఉండే మండపేట మండలాన్ని ఏకం చూస్తూ ఆలమూరు నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 1978లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన సంగిత వెంకటరెడ్డి జనతా పార్టీ నుంచి పోటీ చేసిన ఎస్‌బీటీకే సత్యనారాయణరావుపై 6,573 ఓట్ల ఆధిక్యతతో సంగిత గెలుపొందారు. ఆలమూరు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా సంగిత విజయం సాధించారు. 1983లో టీడీపీ అభ్యర్థి వల్లూరి నారాయణరావుపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన సంగిత 29,636 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1985లో టీడీపీ తరఫున పోటీ చేసిన వల్లూరి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి వాలిన సూర్యభాస్కరరావుపై 20,371 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున మూడో సారి బరిలో దిగిన వల్లూరి నారాయణరావు, కాంగ్రెస్ అభ్యర్థి సంగిత వెంకటరెడ్డిపై 978 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. 1994లో ఆలమూరు నుంచి టీడీపీ తరఫున వీవీఎస్ఎస్ చౌదరి కాంగ్రెస్ అభ్యర్థి సంగిత వెంకటరెడ్డిపై 16,710 ఓట్ల ఆధిక్యతతో చౌదరి గెలుపొందారు. 1999లో రెండోసారి టీడీపీ తరఫున పోటీ చేసిన చౌదరి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి బిక్కిన కృష్ణార్జునచౌదరిపై 12,630 ఓట్లతో గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావుపై కాంగ్రెస్ అభ్యర్థి బిక్కిన కృష్ణార్జునచౌదరి 8017 ఓట్లతో గెలుపొందారు. ఆలమూరు నియోజకవర్గం ఉన్నంత వరకు ఏడు విడతలు ఎన్నికలు జరగ్గా టీడీపీ నాలుగు దఫాలు, కాంగ్రెస్ మూడుసార్లు గెలుపొందాయి. ఎన్నికలు 14 సార్లు జరిగినా ఇక్కడ గెలుపొందిన అభ్యర్థులు మాత్రం నలుగురు మాత్రమే.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డీబీ లోక్

తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే సీటు ఇవ్వడం సిగ్గుచేటు

దళిత ప్రజా సంఘాల సమావేశంలో వక్తల మండిపాటు

అమలాపురం రూరల్, మే 5: శిరోముండనం కేసులో శిక్ష పడ్డ తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వడం సిగ్గుచేటని దళిత ప్రజా సంఘాల సమావేశం ఆరోపించింది. మండపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న త్రిమూర్తులును చిత్తుగా ఓడించాలని శిరోముండనం బాధితుల న్యాయ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. కామనగరువులోని బీవీ రమణయ్య కాలనీలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ పోరాట కమిటీ సమావేశాన్ని ముఖ్య నాయకులతో నిర్వహించారు. దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని వెంకటాయపాలెం దళిత యువకులు మూడు దశాబ్దాల పాటు చేసిన న్యాయ పోరాటం చరిత్రలో నిలుస్తుందన్నారు. బాధితులకు పూర్తి న్యాయం జరగకపోవడం ఆవేదన కలిగించిందన్నారు. త్రిమూర్తులు నేరస్తుడని నిర్ధారించి జైలు శిక్ష విధించినప్పటికీ వైసీపీ ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వడం దారుణమని విమర్శించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి ప్రభుత్వమే ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పోరాట కమిటీ సహ కన్వీనర్ రేవు నాగేశ్వరరావు, మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి యేడిద రాజేష్, డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు అమలదాసు బాబూరావు, పీడీఎం నాయకులు దీపాటి శివప్రసాద్, శెట్టిబత్తుల తులసీరావు, నాయకులు బొంతు రమణ, మెండి డేవిడ్, గెద్దాడ బుద్ధరాజ్, కొండేపూడి రవి పాల్గొన్నారు.

రేపు కోరుకొండకు సీఎం జగన్ రాక

కోరుకొండ, మే5: రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో ఈ నెల 7న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు లక్ష్మీనరసింహస్వామి దేవాలయంవీధిలో ఈ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించండి

● ఎన్నికల పరిశీలకుడు వివేక్ నందన్

రంపచోడవరం, మే 5: ఈనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు జనరల్ ఎన్నికల పరిశీలకుడు కె.వివేక్‌నందన్ తెలిపారు. ఆదివారం ఆయన రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్‌తో కలిసి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎలిప్యాడ్ ల్యాండింగ్ ప్రాంతం, స్ట్రాంగ్ రూమ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పీవోలు, ఏపీవోల శిక్షణ తదితర కార్యక్రమాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు వివేక్ నందన్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులు, సిబ్బందికి వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేస్తామని, ఈ వాట్సాప్ గ్రూపులో ఎన్నికలకు సంబంధించిన వివరాలన్నీ పొందుపరుచుతామన్నారు. ఎన్నికల అధికారులకు సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఏవీ రమణ, సత్యనారాయణ, నాగరాజు, జ్యోతికృష్ణ, డీటీలు బి.రాజు, ఎ.సత్యనారాయణ, స్వామి, బాలాజీ, శ్రీధర్, శివ, విశ్వనాథ్, సరిత, వీరభద్రరావు, ఎన్‌వీ సత్యనారాయణ, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా యల్లమ్మ జాతర

అడ్డతీగల, మే 5: అడ్డతీగల మండలం వేటమామిడి శివారులో ఉన్న ఊడల మర్రి రేణుకా యల్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శని, ఆదివారాలు రెండు రోజులపాటు వైభవంగా కమిటీ నిర్వహించింది. వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, కల్యాణాలతో ఆలయ ప్రాంగాణం భక్తులతో కళకళలాడింది. వేదపండితుల మంత్రోశ్చరణతో భక్తులు పరవసించారు. ఆదివారం రాత్రి జాతర సందర్భంగా వేటమామిడిలో ఊరేగింపు నిర్వహించి కేరళా డప్పులతో స్థానిక సంప్రదాయ నృత్యాలతో జాతర నిర్వహించారు.

అభిమానుల ప్రేమకు దాసోహం

పిఠాపురం నియోజకవర్గంలో
హీరో సాయిధరమ్ తేజ్ ప్రచారం



రోడ్‌షోలో పాల్గొన్న సాయిధరమ్‌తేజ్



పూల వర్షం

పిఠాపురం/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మే 5: 'మా సేనానిని గెలిపించండి, మీ అందరి ప్రేమకు మేమంతా దాసోహం అవుతాం' అని మెగా హీరో సాయిధరమ్‌తేజ్ అన్నారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పిఠాపురం మండలం పాత కందరాడ, ఎఫ్‌కేపాలెం సెంటర్, కొత్త కందరాడ, కుమారపురం, పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు మీదుగా చిత్రాడ గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. అక్కడ నుంచి గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట, తాటిపర్తి గ్రామాల్లో రోడ్‌షో కొనసాగింది. ఎఫ్‌కేపాలెం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ నేను ఒక హీరోగా, పవన్‌కు మేనల్లుడిగా ప్రచారానికి రాలేదని, ఒక సేనానికి సైనికుడిగా ప్రచారానికి వచ్చినట్లు తెలిపారు. పవన్‌కల్యాణ్ ఎల్లప్పుడు ప్రజల పక్షాన నిలబడతారని చెప్పారు. మా సేనానిని గెలిపించండి, నియోజకవర్గ అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తారని తెలిపారు. వేసే ఓట్లకు ఈవీఎంలు పగిలేలా ఉండాలన్నారు. పోలింగ్ రోజున గాజుగ్లాసు మోత మోగాలని, ఫ్యాన్ రెక్కలు విరిగిపోవాలన్నారు. తనకు 2021లో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు పిఠాపురం నియోజకవర్గంలోని అభిమానులు, ప్రజలు పుర్హుతికా అమ్మవారికి పూజలు చేశారని వారందరికీ తాను రుణపడి ఉంటానని చెప్పారు. ప్రజల నుంచి సాయిధరమ్‌తేజ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. అడుగడుగునా పూల వర్షంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన నేత డాక్టర్ పిల్లా శ్రీధర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు భారీ ఏర్పాట్లు

ఒంటి గంటకే సభా ప్రాంగణానికి చేరుకోవాలి
పార్కింగ్‌లోనే వాహనాలు నిలపాలి
ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రాక సందర్భంగా అత్యంత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సభా ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ప్రదేశాలను ఎస్‌ఎస్‌జీ తమ ఆధీనంలోకి తీసుకొంది. పెద్ద సంఖ్యలో పోలీసులను, కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. తనిఖీ బృందాలు అణువణువునూ జల్లెడ పడుతున్నాయి. ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలని, ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని ఎస్పీ జగదీశ్ సూచించారు. అటు విజయవాడ, ఇటు విశాఖ వైపు నుంచి వచ్చే వాహనాల కోసం వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు విశాలంగా ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులను గమనించుకుంటూ ప్రయాణించాలని ఆయన సూచించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఒంటి గంటకే సభా ప్రాంగణానికి చేరుకోవాలి

ప్రధాని మోదీ చేరుకొనే హెలిప్యాడ్‌ల నుంచి సభా ప్రాంగణానికి హైవేతో కలుపుకొని 1.6 కిలోమీటర్ల దూరం ఉంది. మధ్యాహ్నం 1 గంట తర్వాత ఈ మార్గంతో పాటు వేమగిరి జంక్షన్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకునే మార్గాలను భద్రతా బలగాలు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటాయి. వాహనాలను, ప్రజలను అనుమతించరు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. తీవ్రమైన ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. అందువల్ల మధ్యాహ్నం 1గంటలోపుగానే సభా ప్రాంతానికి చేరుకొని నిర్దేశిత ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసి వేదిక వద్దకు ప్రజలు చేరుకోవాలని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే

రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లు దాటిన తర్వాత ఎడమవైపు పార్కింగ్ నెం.7, 8లో నిలుపుకోవాలి. కాస్త ముందుకు వెళ్లిన తర్వాత కూడా ఎడమవైపు కార్లు(నెం.6), ఆ వెనుక 4ఏ, 4బీ ప్రదేశాల్లో బస్సులు పార్క్ చేయాల్సి ఉంటుంది. కుడివైపున పార్కింగ్ నెం.5లో కార్లు, బస్సులు నిలపాలి. అలాగే వేమగిరి జంక్షను వైపు నుంచి వచ్చే వాహనాల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు ఎడమవైపున పార్కింగ్ నెం.2లో పెట్టాలి. కుడివైపున కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ నెం.1లో, ఈ పార్కింగ్ వెనుక పార్కిగ్ నెం.3లో బస్సులు నిలపాల్సి ఉంటుంది. వీవీఐపీ పాసులు ఉన్న వాహనాలను 4ఏ పార్కింగ్‌లో నిలపాలి. డయాస్ పాస్ ఉన్నవారు మీటింగ్ ప్రాంతంలో దిగి వారి వాహనాలను వేమగిరి జంక్షను దగ్గరలోని విందు రెస్టారెంట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో పెట్టాలి. మధ్యాహ్నం 2గంటల నుంచి ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ, వేమగిరి జంక్షను నుంచి క్వారీ కెనాల్ రోడ్డు పీవీఆర్ ఎస్టేటు వద్ద ఏర్పాటు చేసి పార్కింగ్ నెం.5కి వాహనాలను మళ్లిస్తారు.

అభ్యర్థితో.. ఒకరోజు



కారులోనే అల్పాహారం..



ఆంధ్రజ్యోతి చదువుతూ

మార్నింగ్ కాఫీ తాగుతూ..

నియంత పాలనపై యుద్ధంలో

ప్రతి క్షణం కీలకమే..

నేను నిద్రపోను
పార్టీ క్యాడర్‌ను నిద్రపోనివ్వను
కూటమి అధికారంలోకి
రావడమే ప్రధాన లక్ష్యం
ఉదయం 6నుంచి రాత్రి 9గంటల
వరకు ప్రజల మధ్యనే
రాజమహేంద్రవరం సిటీ కూటమి
అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో ఒక రోజు

ఐదేళ్ల నియంత పరిపాలనకు చరమగీతం పాడి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఈ ఎన్నికల సమయం అత్యంత కీలకమని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో 'ఆంధ్రజ్యోతి' ఒకరోజు ప్రయాణం చేసింది. ప్రస్తుత బిజీ సమయంలో ఆయన దినచర్య ఏంటనేదానిపై పరిశీలన చేసింది. ఆయన రోజుకు కేవలం 4 గంటలు మాత్రమే నిద్రిస్తున్నారు. మిగిలిన సమయం అంతా ఎన్నికల ప్రచారం, డివిజన్ల వారీగా బలాబలాలు అంచనాలు, క్షేత్రస్థాయిలో ఓటర్లను కలవడం, ప్రచారాలు, వివిధ వర్గాలకు చెందిన నాయకులను, ప్రముఖులను కలవడం ఇలా ప్రతిక్షణం ఆయన బిజీగానే గడపడం 'ఆంధ్రజ్యోతి' గుర్తించింది. ●రాజమహేంద్రవరం సిటీ

బిజీ షెడ్యూల్

ఆదిరెడ్డి శ్రీనివాస్ ఉదయం 5 గంటలకు నిద్రలేచారు. అక్కడ నుంచి కొద్దిసేపు వ్యాయామం చేశారు. బ్రెష్ చేసిన తర్వాత ఉదయం 6 గంటలకు కుటుంబ సభ్యులతో భేటీ అయ్యారు. రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న ప్రచారంపైన చర్చించారు. అనంతరం కాఫీ తాగి పేపర్ చదివారు. నగరంలో ముఖ్యనాయకులకు ఫోన్లలో దిశానిర్దేశం చేశారు. ఉదయం 7 గంటలకు ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆయన భార్య ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తల్లి తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ నగరంలో నలుదిక్కులా ప్రచారాలకు వెళ్లిపోయారు.



మధ్యాహ్న భోజనం చేస్తూ..

కారులోనే టిఫిన్..పార్టీ ఆఫీస్‌లో భోజనం

ఉదయం 8 గంటల నుంచి డివిజన్ల వారీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మేనిఫెస్టో, లోకల్ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. జగన్ ప్రభుత్వ దుర్మార్గ పాలనను ప్రజలకు వివరిస్తున్నారు. ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన, ఎంపీగా పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విజ్ఞప్తి చేస్తున్నారు. మధ్యలో 10-11 గంటల మధ్య ప్రచారంలోనే ఆయన కారులో కూర్చుని అల్పాహారం తీసుకున్నారు. అటుపై వెంటనే మళ్లీ ప్రచారంలోకి వెళ్తున్నారు. మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల మధ్యలో భోజన విరామం తీసుకున్నారు. ఈ సమయంలో ఎన్నికల కార్యాలయం వద్ద, గాని వీలుంటే ఇంట్లో గాని భోజనం చేస్తున్నారు. అటుపై 2 గంటల నుంచి 4 గంటల మధ్య వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులను కలిసి కూటమి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. మళ్లీ సాయంతం 4 గంటలకు తిరిగి డివిజన్లలో ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. రాత్రి 9 గంటల వరకు ప్రచార పర్వం కొనసాగింది. అటుపై తిలక్‌రోడ్డులోని పార్టీ ఎన్నికల కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులతో ప్రచారం తీరుపైన డివిజన్ల వారీగా చర్చిస్తున్నారు. రాత్రి ఇంటికి చేరుకుని తర్వాత రోజు ప్రచారం ప్లానింగ్, డివిజన్ల వారీగా క్యాడర్‌తో ఫోన్‌లో మాట్లాడడం తదితర పనులతో రాత్రి 1 గంట వరకు ఆయన బిజీగా ఉన్నారు. తెల్లవారుజామున 2 నుంచి 5 గంటల మధ్య నిద్రిస్తున్నారు.

నేను నిద్రపోను

కార్యకర్తలను నిద్రపోనివ్వను



కార్యకర్తలతో మాటామంతీ



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలి. ప్రజల బతుకులు మారాలి, రాష్ట్రం అభివృద్ధి చెందాలి. ఈ ఎన్నికల్లో తామంతా గెలవాలి అంతవరకు నిద్రపోను, పార్టీ క్యాడర్‌ను నిద్రపోనివ్వను. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తున్నారు. కూటమి అధికారంలోకి రావడం ఖాయం. రాజమహేంద్రవరం అభివృద్ధి, సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపాలి . అందుకు ప్రణాళిక రూపొందించాం. లోకల్‌మేనిఫెస్టోలో హెల్త్ ఏటీఎంలు, మల్టీపర్పస్ స్పోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణాలు, టూరిజం హబ్, మహిళా రక్షణ దళం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పొందుపరిచిన ప్రతి అంశాన్ని కార్యరూపం దాల్చే విధంగా చేసి చూపిస్తా. ఉమ్మడి మేనిఫెస్టో పథకాలు ప్రజలకు చేరువచేస్తా. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం. అవినీతి వైసీపీని ఈ ఎన్నికల్లో ప్రజలు ఓడించాలి . కూటమిని గెలిపించాలి. చంద్రబాబును సీఎం చేస్తే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. **- ఆదిరెడ్డి వాసు..**

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు



శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ అభ్యర్థులకు దిష్టి తీస్తున్న మహిళ

రాజమహేంద్రవరం సిటీ, మే 5: రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గిడుగు రుద్రరాజును, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోడా వెంకట్‌లను గెలిపించాలని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో గోరక్షణ పేట, గానుక వీధి తదితరు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రచారం చేశారు. తొమ్మిది గ్యారెంటీలతో ప్రజలకు మంచి భవిష్యత్తును అందించే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో వారికి మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరు: దొమ్మేరులో ఎమ్మెల్యే అభ్యర్థి అరిగెల అరుణకుమారి ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పథకాలను వివరించారు. బాబు జగ్జీవన్‌రామ్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు నివాళులర్పించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా గిడుగు రుద్రరాజుకు హస్తం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొనిదల శ్రీనివాసరావు, సీతా వెంకటేశ్వర్లు, ముదునూరి కృష్ణంరాజు, కలగర చంద్రరావు, సిరవరపు సుబ్రహ్మణ్యం, కలగర వెంకట్రావు, పేరిచర్ల బాలకృష్ణంరాజు, సోయారాజు, కొక్కిరిపాటి సురేష్ పాల్గొన్నారు.

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్

ముఖ్య వైద్యాధికారిగా కాండ్రేకుల ప్రమీల

రాజమహేంద్రవరంరూరల్, మే 5: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ ఎంవీఎల్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లా కమిషన్ చైర్మన్ లింగంపల్లి నాగమణికంఠ ఇద్దరిని నియమించారు. ఏపీ కమిషన్ ముఖ్యవైద్యాధికారిగా డాక్టర్ కాండ్రేకుల పమీల, జిల్లా ఆర్‌టీఐ ఇన్‌చార్జిగా కొమ్మిశెట్టి ఆది వరప్రసాద్‌లను నియమించి నియామకపత్రాలు ఆదివారం అందించారు. ఈసందర్భంగా నూతన సభ్యుడు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకై తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మాలిశివకుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ఎ. సంతోష్ కృష్ణ, ఎ.సతీష్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయండి : రామకృష్ణారెడ్డి

అనపర్తి, మే 5: సోమవారం రాజమహేంద్రవరంలో జరిగే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని అనపర్తి ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్డీయే కూటమి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ బహిరంగ సభకు అనపర్తి నియోజకవర్గం నుండి పదివేల పైబడి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. రంగంపేట మండలం నుంచి వచ్చే వారు ఎస్టీ రాజాపురం నుండి బయలు దేరాలి అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాల నుండి వచ్చేవారు అనపర్తి నుండి బయలు దేరాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బిజెపీ నాయకులు శివరామ కృష్ణంరాజు. హరినారాయణ రెడ్డి, జనసేన నాయకులు రావాడ నాగు టీడీపీ నాయకులు ఆకుమర్తి చిన్న మాదిగ, తమలంపూడి సుధాకరరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అనపర్తి వారపు సంతలో ప్రచారం నిర్వహిస్తున్న ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



పందలపాకలో నల్లమిల్లి విజయం కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్న సతీమణి మహాలక్ష్మి



బిక్కవోలులో చర్చిలో ప్రార్థనలలో పాల్గొన్న ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి తనయుడు మనోజ్‌రెడ్డి

అరాచక పాలన నుంచి త్వరలో విముక్తి కలగనుంది

● ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, మే 5: ఐదేళ్ల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం నుంచి ప్రజలకు త్వరలోనే విముక్తి కలుగనుందని అనపర్తి ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని మెయిన్‌రోడ్డులోని వ్యాపారులను, వారపుసంతలో కాయగూరల వ్యాపారులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కమలం గుర్తుపై ఓట్లువేసి ఎంపీ అభ్యర్థిని పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి తనను గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. దేవీచౌక్ నుంచి రైల్వేస్టేషన్ వరకు వ్యాపార కూడళ్ల వద్దకు వెళ్లి ఆయన ప్రచారం నిర్వహిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని మరో ఛాన్సు ఇస్తే పరిస్థితి ఏమిటో అందరికీ తెలిసిందని విజ్ఞతతో ఆలోచనచేసి ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వర్తక, వ్యాపారుల నుంచి నల్లమిల్లికి విశేష స్పందన లభించింది. పందపాకలో నల్లమిల్లి విజయం కోరుతూ సతీమణి మహాలక్ష్మి ఆదివారం బిక్కవోలు మండలం పందలపాకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కుతుకులూరులో నల్లమిల్లి కుమార్తె డాక్టర్ సనాతని ప్రచారం

తన తండ్రి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా , ఎంపీ అభ్యర్థిని పురందేశ్వరి పోటీచేస్తున్నారని వీరిద్దరికీ కమలం గుర్తుపై ఓట్లువేసి విజయం చేకూర్చాలని డాక్టర్ సనాతని ఆదివారం కుతుకులూరులో రెండోరోజు ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకోవడంతో పలువురు ఆమె చూపుతున్న ప్రేయను అభినందించారు.

నల్లమిల్లి తనయుడు మనోజ్ ప్రచారం

ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి విజయం కోరుతూ ఆయన తనయుడు మనోజ్ రెడ్డి ఆదివారం బిక్కవోలు మండలం ఇల్లపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. మండలంలోని పలు చర్చిలలో జరిగిన ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు.



ముకుందవరంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులను అభినందిస్తున్న రామకృష్ణారెడ్డి

టీడీపీ జనసేన బీజేపీలలో చేరికలు

రంగంపేట: సార్వత్రిక ఎన్నికలు పట్టుమని పదిరోజులు లేకపోయినప్పటికీ వైసీపీ నుంచి టీడీపీ జనసేన బీజేపీ పార్టీలలోకి చేరికలు ప్రవసనంగా సాగుతూనే ఉన్నాయి. ఆదివారం రంగంపేట మండలం ముకుందవరం, దొడ్డిగుంట గ్రామాల నుంచి అనేక కుటుంబాలు వైసీపీ నుంచి కూటమి పార్టీలలోకి చేరారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి నల్లమిల్లి వీరిని ఆహ్వానిస్తూ కండువాలు కప్పారు. ముకుందవరంలో వైసీపీ నుండి గుత్తుల సుబ్రహ్మణ్యం, గుత్తుల రాంబాబు, పోతుల రాజశేఖర్, గుత్తుల శ్రీనివాసరావు, గుత్తుల శ్రీను, మేడిశెట్టి సత్తిబాబు, గుత్తుల నాగేశ్వరరావులు బీజేపీలో చేరారు. వైసీపీ నుంచి మాజీ సర్పంచ్ సుక్కిరెడ్డి గణేశ్వరరావు, వట్టికూటి వీరవెంకట సత్యసాయిప్రసాద్, వట్టికూటి సాయిచంద్రరావు, వట్టికూటి వెంకటేశ్వర్లు, వట్టికూటి వీబాబు, కేతా సింహాచలం, అలాగే వడిశలేరు గ్రామానికి చెందిన వల్లూరి సూరిబాబులు తెలుగుదేశం పార్టీలో చేరారు.

పదేళ్లలో ఏపీకి కేంద్రప్రభుత్వం చేసిందేమీలేదు

● తెలంగాణ ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు

రాజమహేంద్రవరంసిటీ, మే 5 : పదేళ్లగా అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చేసిందేమీలేదని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టం ప్రత్యేక హోదా వంటివి ఏదీ పూర్తి చేయకుండా బీజేపీ, వైసీపీ, టీడీపీలు నిర్లక్ష్యం వహించాయన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక రెండుసార్లు ఎన్నికలు జరిగాయని, రెండు ప్రభుత్వాల పనితీరును ప్రజలు చూశారని చెప్పారు. ఈ ప్రాంతం అభివద్ధి సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ఏవిధమైన ప్రణాళికతో ముందుకువెళ్లిందో ప్రజలందరికీ తెలుసునన్నారు. రుద్రరాజు పార్టీని నమ్ముకుని కృషి చేస్తున్న వ్యక్తి అని తమ వంతు బాధ్యతగా గెలిపించాలని కోరేందుకు వచ్చానన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు మార్పుకావాలనుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు రెండు బీజేపీకి అనుకూలన పార్టీలేనన్నారు. ఈ ప్రాంత యువత చాలాతెలివిగల వారని వారు ఆలోచన చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాలు రాహుల్ గాంధీ ప్రధాని కావాలని అప్పుడే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కోరుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేరాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు.

మోదీ సభలో నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

● కాంగ్రెస్ అభ్యర్థి గిడుగు

రాజమహేంద్రవరం సభకు వస్తున్న దేశ ప్రధాని నరేంద్రమోదీ తాను అడిగే పది ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి విభజన జరిగి పదేళ్లు అయ్యిందని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని పెట్టింది బీజేపీ. ప్రత్యేక హోదా ఎప్పుడు ఇస్తారు? పోలవరం ప్రాజెక్టు కేంద్రప్రభుత్వం ఎందుకు చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారు? విశాఖకు ప్రత్యేక రైల్వే జోను కావాలని ఈ ప్రాంత ప్రజలు కోరారు అదిలేదు. దుగ్గిరాజపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, గంగవరం పోర్టులను ఆదానికి దారాత్తం చేయడం, రాజధాని విషయంలో ప్రజల నోట్లో మట్టికొట్టారని, విభజన చట్టం అమలు ఎందుకు చేయలేదు. స్టీల్ ప్లాంట్‌ను ఎందుకు పప్పుబెల్లాలకు ఇస్తున్నారని ప్రశ్నిచండం, రిజర్వేషన్లు ఎత్తివేసే పరిస్థితులు, ఆయన ఏ మొఖంపెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నారని ప్రశ్నించారు.

ఏజెన్సీ సమాచారం

పొల్లూరు పవర్ ప్లాంట్, జలపాతాలను సందర్శించిన ఖమ్మం పార్లమెంట్ అబ్జర్వర్ చరణ్‌జిత్ సింగ్



మోతుగూడెం, మే 5: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణా రాష్ట్రం ఖమ్మం పార్లమెంట్ అబ్జర్వర్ చరణ్‌జిత్ సింగ్ ఆదివారం సందర్శించారు. ఏపీ జెన్కో అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పవర్ ప్లాంట్‌లో ఎంసీఆర్‌లో విద్యుత్ తయారయ్యే విధా నం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి పొల్లూరు టైగ ర్స్ జలపాతాలను, చుట్టు ప్రక్కల ప్రదేశాలను సందర్శించారు.

మీ ఆడబిడ్డగా వచ్చా..ఓటువేసి ఆశీర్వదించండి

● రంపచోడవరం ఎన్డీఏ కూటమి అభ్యర్థిని శిరీషాదేవీ



రోడ్‌షోలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థిని శిరీషాదేవీ

ఎటపాక, మే 5:మీ ఆడబిడ్డగా వచ్చా.... ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఓటువేసి...ఆశీర్వదించాలని.. ఎన్డీఏ కూటమి రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిని మిరియాల శిరీషాదేవీ కోరారు. ఆదివారం ఎటపాక మండలంలో పలు గ్రామాల్లో ఆమె రోడ్‌షో నిర్వహించారు. మండల కేంద్రమైన ఎటపాక, పురుషోత్తపట్నం, నెల్లిపాక, చోడవరం, తోటపల్లి, గన్నవరం, గౌరిదేవిపేట, నల్లకుంట, విస్సాపురం గ్రామాల్లో ఆమె రోడ్‌షో నిర్వహించి, మాట్లాడారు. నెల్లిపాక, తోటపల్లి గ్రామాల్లోని పలు కుటుంబాలు శిరీషాదేవీ సమక్షంలో టీడీపీ చేరాయి. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కిలారి వెంకన్న, నలజాల శ్రీకాంత్ చౌదరి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్, పాటి చలపతి, జనసేన మండలాధ్యక్షుడు మారిసు గంగాధర్, పూరేటి వెంకటేశ్వరరావు, ఏలూరి వెంకన్న, బొల్లా పుల్లయ్య, కరి అశోక్ పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం ఆదివారం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భారీగా ప్రచారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చింతూరు బీజేపీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మడివి రాజు మోతుగూడెం పురవీధుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఆదివారం మోతుగూడెం సంతలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు పాసిరమణ, ఓలయ్య, ధారబాబు, కొత్తపల్లి మాజీ టీడీపీ సర్పంచ్ కరణం లక్ష్మయ్య, బీజేపీ నాయకులు పాయం వెంకటేష్, నేమలు రామారావు, ముత్తయ్య, జనసేన నాయకులు భీమరాజు, సాయి, రాంప్రసాద్ మహిళలు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని ప్రతీ గ్రామంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, అసెంబ్లీ అభ్యర్థి మిరియాల శిరీషను అఖండ మెజార్టీతో గెలిపించాలంటూ కార్యకర్తలు ఊరూరా తిరిగారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో ఎడవిల్లి భాస్కరరావు, గడేసుల ప్రేమ్‌చంద్, చలకాని ఉమామహేశ్వరరావు, దాసరి నరేంద్ర, హేమంత్, నేముల రామారావు, పాయం వెంక య్య, బండారు సాంబశివరావు పాల్గొన్నారు.

వారపుసంతలో ప్రచారం

రంపచోడవరం, మే 5: దళిత, గిరిజన, కార్మిక, మహిళల సమగ్ర హక్కుల కోసం పోరాడుతున్న సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ అభ్యర్థి పల్లాల లచ్చిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం వారపు సంతలో ప్రచారం నిర్వహించారు. భూస్వామ్య, అవినీతి అక్రమార్జన పార్టీలైన బీజేపీ, టీడీపీ, వైసీపీ పార్టీల మోసాలను ఎండగట్టాలన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి

● భారత రాజ్యాంగ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాధీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న శోభనాధీశ్వరరావు

రంపచోడవరం, మే 5: బీజేపీ కూటమి పార్టీలను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని భారత రాజ్యాంగ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాధీశ్వరరావు అన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా నాయకులు మట్ల వాణిశ్రీ అధ్యక్షతన రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాధీశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, పౌర హక్కులను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతుందని, అటువంటి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు ప్రత్యక్షంగా, వైసీపీ పరోక్షంగా తొత్తులుగా వ్యవహరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, రైతుకూలీ సంఘం నాయకులు సింహాద్రి, ఝాన్సీ, రాష్ట్ర హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ కె.విజయరావు, ఏఐఏడబ్ల్యువో జాతీయ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, మాజీ ఐఏఎస్ అధికారి మండల బండ్ల శ్రీనివాస్, మనోహరమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కా బాలు, సర్పంచ్ విజయ పాల్గొన్నారు.

సిరిగిందలపాడులో వైద్యశిబిరం

రంపచోడవరం, మే 5: రాజమహేంద్రవరం రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందాజీ తెలిపారు.వైద్యశిబిరంలో వైద్యులు టి.వి.సుబ్బారావు, దాసరి ఉమామహేష్, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్‌కుమార్‌లు సుమారు 110 మందికి వైద్యసేవలు అందించా రు. అనంతరం రోగులు సహాయకులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి రావడానికి ఐకమత్యంగా ముందుకెళదాం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి

● వైసీపీకి భారీ షాక్...

● వేమగిరి మాజీ సర్పంచ్, వైద్యుడు నాని టీడీపీలో చేరిక



కడియంలో డాక్టర్ వెంకటాచలంతో పాటు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు

కడియం/రాజమహేంద్రవరం రూరల్, మే 5 :వైసీపీకి భారీ షాక్ తగిలింది. వేమగిరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైద్యుడు వెలుగుబంటి వెంకటాచలం (నాని) ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి డాక్టర్ వెంకటాచలం(నాని)కి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.వెంకటాచలంతో పాటు మాజీ సర్పంచ్ మాకే భూషణం, మాజీ ఎంపీటీసీ కుంచే శశిరేఖ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ మంచి వ్యక్తిగా, సౌమ్యునిగా పేరున్న డాక్టర్ వెంకటాచలం(నాని) టీడీపీలోకి రావడం శుభపరిణామమన్నారు. కూటమి అధికారంలోకి రావడానికి అంతా ఐకమత్యంతో మెలగుతూ సమిష్టిగా ముందుకెళదాం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీను, వెలుగుబంటి నాని, ముద్రగడ జమీ, ఆదిమూలం సాయి, వాసంశెట్టి నాగబాబు, బోడపాటి గోపి, గట్టి సుబ్బారావు దంగేటి సత్తిబాబు, జంగా వినోద్, జల్లి కృపారావు, గుత్తుల కృష్ణ, యనమదలరాజు, యడ్ల మహేష్, కొప్పిశెట్టి రాజేష్ అల్లంపల్లి ప్రసాద్, కాంద్రేగుల సత్తిబాబు, పరిమి మణికంఠ, జాన్‌బాబు, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

● రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, అయన కుమార్తె కంఠమనేని శిరీషలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీఇంటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు టీడీపీ సైకిల్ గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థినిగా పోటీచేస్తున్న ఎన్టీరామారావు కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరికి బీజేపీ కమలం గుర్తుపైనా ఓటేసి విజయం చేకూర్చాలని గోరంట్ల విజ్ఞప్తి చేశారు. సుంకవిల్లి వెంకటరత్నం, మన్యం పెద్దబాబు, నున్న కృష్ణ, దాసరి రామకృష్ణ, సీహెచ్ శివరామకృష్ణ, దండమూడి శ్రీహరి, మద్దుకూర అచ్యుతరామారావు, బోగవిల్లి రామారావు, టీడీపీ,జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: టీడీపీ నాయకులు యర్రమోతు ధర్మరాజు, బీజేపీ నాయకుడు ఒంటెద్దు స్వామి కార్యకర్తలతో కలిసి బోటు ఆఫీసువీధి, గొల్లపేట, జీటీపీఎస్ కాలనీ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.





రూరల్ మండలం తొర్రేడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరింట్ల, ఆయన కుమార్తె శిరీష



ధవళేశ్వరంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

80మంది వృద్ధులకు పింఛన్లు పంపిణీ



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 5 : రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీకళాశాల ప్రాంగణం ఆనంద్ గార్డెన్స్‌లో వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 80 మంది వృద్ధులకు పింఛన్లు చేశారు. ఆదివారం క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాద్, బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ కొత్తపల్లి శ్రీనివాస్‌ల చేతుల మీదుగా వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందించారు. గత 13 ఏళ్లుగా క్లబ్ ఆధ్వర్యంలో పేద వృద్ధుకు పింఛన్లు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్న క్లబ్ వ్యవస్థాపకుడు పాముర్తి గోపాలరావు, కార్యదర్శి గుబ్బల గంగాభవాని, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి బొల్లా సత్తిబాబు, బేరి రత్నాంబ, లంకే శ్రీదేవి, గీసాల బాపూజీ, ఉప్పులూరి కాశీ విశ్వనాధం, శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రధాని సభ విజయవంతం చేయండి

● రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ



కోరుకొండ, మే 5 : రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధి వేమగిరిలో జరుగుతున్న ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాజానగరం కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రధాన బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. వైసీపీని గద్దె దించి కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.ఈ బహిరంగ సభ వల్ల రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి, కూటమి అసెంబ్లీ అభ్యర్థి అయిన తనకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు.

అక్రమ మద్యంతో వ్యక్తి అరెస్టు



మద్యంతో పట్టుబడిన నిందితుడితో ఎస్ఈబీ అధికారులు

రంపచోడవరం, మే 5: అక్రమ మద్యం కలిగిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎన్. ఇంద్రజిత్ తెలిపారు. జిల్లా ఎస్పీ తూహిన్ సిన్హా, ఎస్ఈబీ ఎస్పీ ఎస్.శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు ఆదివారం వై.రామవరం మండలం బొడ్డుమామిడిలో దాడులు నిర్వహించి అక్రమ మద్యం కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని 145బాటిళ్ల మద్యం, 24.5 లీటర్ల బీర్లు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ అబ్దుల్‌అలీమ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ బొబ్బ పద్మావతి కన్నుమూత



ధవళేశ్వరం, మే 5: ధవళేశ్వరం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బొబ్బ పద్మావతి(62)ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆమె స్వగృహంలో ఆకస్మికంగా మృతి చెందా రు. ఆమె భర్త బొబ్బ సుబ్రహ్మణ్యచౌదరి తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి 1996లో ఎంపీటీసీగా గెలుపొందారు. భార్య పద్మావతి 2002లో సర్పంచ్‌గా గెలుపొందారు. భర్త సుబ్రహ్మణ్యచౌదరిని పలువురు టీడీపీ నాయకులు, గ్రామ ప్రముఖులు పరామర్శించి పద్మావతి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు.

స్వాతంత్ర్య సమరయోధుడు సూర్యప్రకాశరావు భార్య మృతి

రాజమహేంద్రవరం కల్చరల్ మే 5: స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత సూర్యప్రకాశరావు భార్య వెంకటరత్నాంబ(99) ఆదివారం హైదరాబాదులో మృతి చెందారు. రత్నాంబ గౌతమీ టైమ్స్ ఎడిటర్ శివరామ్ తల్లి. ఆమెకు నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. ఆఖరి మనువడు పవన్‌కాంత్ డిల్లీలో బీబీసీ న్యూస్‌లో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు.



ఐక్యతను చాటుతున్న శెట్టిబలిజ, గౌడ నాయకులు

జగన్ దోచుకున్నాడు

● బీసీలకు న్యాయం చేసేది కూటమి ప్రభుత్వమే

● అధికారంలోకి వచ్చాక చర్యలు

● శెట్టిబలిజ, గౌడ ఆత్మీయ సభలో నేతలు

రాజమహేంద్రవరం సిటీ, మే 5 : జగన్ రెడ్డి రాష్ట్రంలో బీసీలను ద్రోహం చేశా డని అన్నివ్యవస్థలను భ్రష్టుపట్టించి కేవలం దోచుకోవడం దాచుకోవడమే నినాదంగా దగా చేశాడని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాజమహేంద్రవరం కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డిశ్రీనివాస్‌లు అన్నారు. ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్ సమీపంలో శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో రెడ్డి మణేశ్వరరావు పర్యవేక్షణలో చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన శెట్టిబలిజ గౌడ ఆత్మీయ సభకు వారు అమలాపురం టీడీపీ పార్లమెంట్ అధ్యక్షురాలు రెడ్డి అనంతలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీలను గుర్తించి రిజర్వేషన్లు అందించింది అన్న ఎన్టీఆర్ అన్నారు. అదే స్ఫూర్తిని చంద్రబాబు ముందుకు తీసుకువచ్చారని చెప్పారు. బీసీలలో కులవృత్తులను ఆదుకుని అభివృద్ధి చేసింది టీడీపీ ప్రభుత్వమన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే బాధ్యత బీసీ కులగణన చేసే బాధ్యతలను పురందేశ్వరి తీసుకోవాలన్నారు. అనంతరం దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 50శాతం వర్కులు బీసీ కులాలకు చెందిన వారికే ఇస్తానన్నారు. ఎంతమంది బీసీలకు వర్కులు అప్పగించా రో జగన్ చెప్పాలన్నారు. రాష్ట్రంలో దండుకో అనే ఏకైక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. ఏదైనా పార్టీ అధికారంలోకి వస్తే నిర్మాణాత్మక పనులతో పరిపాలన చేయాలని, కానీ ఈరోజు అవినీతిపాలన, విధ్వంసం పాలన చూస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విధ్వంసం చేశాడని ప్రజావేదిక కూల్చివేశారని, అంతర్వేది రథాన్ని దగ్ధం చేశారని, దుర్గమ్మ వారి సింహాలు మాయం చేశారని, రామతీర్థంలో శ్రీరాముని శిరచ్ఛేదనం చేశారని, పిఠాపురంలో గుడిని ధ్వంసం చేశారన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులుపెట్టి బయపెట్టారని అన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోవడం సిగ్గుచేటు అటువంటి తరుణంలో మూడు రాజధానులు పెట్టి ప్రాంతీయ విద్వేశాలు జగన్ రెచ్చగొట్టారన్నారు. బీసీలలో ఉపకులాలలకు కార్పొరేషన్లు పెట్టి చిచ్చుపెట్టారన్నారు. జగన్ అవినీతీ ఏదిచూసిన కనిపిస్తోందని, ఇసుక, మట్టి, మద్యం అన్నింటిలోను అవినీతేఅన్నారు. నాణ్యతలేని మద్యం పేదలతో తాగించి వారి ఆరోగ్యాలతో ఆటలాడుకుంటూ జేబీలను నింపుకున్నది జగన్ కాదా అని ప్రశ్నించారు. కేంద్రం 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేయమంటే నిర్మించలేదన్నారు. పేదవారు ఎవరూ బెంగళూరు. హైదరాబాద్‌లలో ప్యాలెస్‌లు ఉన్నవారా అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించడానికి ముందుకువచ్చారని చెప్పారు. ఈరోజు మూడు పార్టీలు నాయకత్వాన్ని చూస్తే సమాజంలో బడుగు బలహీన వర్గాలకు, వెనుకబడిన వర్గాలకు మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. మూడుపార్టీల వెనుక మోదీ, స్ఫూర్తి చంద్రబాబు యార్తి, పవన్ శక్తి కలిసి ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయన్నారు. 14లక్షల కోట్లు అప్పు భారం రాష్ట్రంపై ఉందన్నారు. అప్పులు ఊబిలో రాష్ట్రాన్ని నెట్టివేశారన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘ అనుభవం కలిగిన చంద్రబాబు సీఎం కావాలన్నారు. మనది ట్రిబుల్ ఇంజన్ సర్కార్ అని అన్నారు. నగర చరిత్రను నన్నయ కందుకూరి, ప్రకాశం పంతులు నడయాడిన నేల ఈ రోజు బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డాగా మారడం దారుణం, ఇలాంటి వైసీపీ ప్రజాప్రతినిధులు మనకు కావాలా అని ప్రశ్నించారు. గోదావరి ప్రక్షాలన చేయాలని రూ. 50 కోట్లు ఇస్తే రెండు రోడ్లు , ఒక హ్యాపీ స్ట్రీట్ నిర్మాణం చేసి ఇదే అభివృద్ధి అంటున్నారంటే మనల్ని ఎంత తక్కువ అంచనా వేస్తున్నారో ఆలోచించాలన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పాటు ఏడుగురు కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పకుండా బీసీల ఐక్యత కోసం అందరు కలిసి కట్టుగా వెళ్లాలన్నారు. అందరి ఆలోచనకు తగ్గట్టుగా తాము పని చేస్తామన్నారు. ఎన్‌డీఏ కూటమికి అందరూ సహకరించాలన్నారు. సభను విజయంతం చేసిన శెట్టిబలిజ గౌడ శ్రీసైన, యాత సంఘీలందరికీ కుడుపూడి సత్తిబాబు ధన్యవాదాలు తెలిపారు. ఐక్యతను చాటి కూటమిని అధికారంలోకి తీసుకువస్తున్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో బుడ్డిగ రాధా, కట్టా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూరంపూడి శ్రీహరి, బీసీ సెల్ నగర్ అధ్యక్షుడు బుడ్డిగ రవి, చింతలపల్లి నాని, మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ, కడలి వెంకటేశ్వరావు, చంటి, డి.నాగేశ్వరరావు, సత్తిబాబు, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. ప్రజాసేవ చేసుకునే భాగ్యం కల్పించండి

● రోడ్ షోలో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపు



ప్రచారంలో కార్యకర్తలతో ఆదిరెడ్డి శ్రీనివాస్



రోడ్ షోలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మే 5: ప్రజలకు సంక్షేమం ఫలాలు అందించి నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే నా లక్ష్యాన్ని సాధించేందుకు రాజమహేంద్రవరం నగర ప్రజలందరూ ఆశీర్వదించి మీసేవ చేసుకునే భాగ్యం కల్పించాలని సిటీ నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. ఆదివారం రాజమహేంద్రవరంలో 1, 2, 37, 42, 43, 50 డివిజన్లలో ఆయన సిటీ నియోజకవర్గ పరిశీలకుడు ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, ఆయా డివిజన్ల ఇన్‌చార్జి, టీడీపీ నాయకులతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు ఆయా డివిజన్లలో ఘనస్వాగతం లభించింది. పూలు చల్లుతూ హారతులు ఇస్తూ స్వాగతించారు. మహిళలను, వ్యాపారులను, వృద్ధులను, కార్మికులను, రోడ్డుసైడ్ చిన్నచిన్న వ్యాపారాలు చేసే వారిని ఆయన ఆప్యాయంగా పలుకరించారు. ప్రజలకు నమస్కరిస్తూ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా సెంటర్లలో ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రజల నుద్దేశించి మాట్లాడారు. గత ఐదేళ్లుగా రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. జగన్ పాలనలో ప్రజలకు మేలు చేయకపోగా దోపిడీ జరిగిందన్నారు. దోచుకోదాచుకో నినాదంతో వైసీపీ ప్రజాప్రతినిధులు పరిపాలన చేశారన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రం బాగుపడాలంటే కూటమి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. నగరంలో సుందరీకరణను అభివృద్ధి అని చెబుతున్న భరత్ రామ్ అనాలోచి నిర్ణయాలతో ప్రజాధనాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశాడన్నారు. ఇటువంటి వ్యక్తికి ప్రజాప్రతినిధి అయ్యే అర్హత లేదన్నారు. రాజమహేంద్రవరాన్ని టీడీపీ ఎప్పుడో అభివృద్ధి చేసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నగరంలో రాత్రి 7గంటలకే మహిళలు స్వేచ్ఛగా బయట తిరగలేని దుస్థితి ఉందన్నారు. బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లను పెంచి పోషించారని చెప్పారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వారి భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలన్నారు. ఎమ్మెల్యేగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, కమలం గుర్తుపై ఓటు వేసి దగ్గుబాటి పురందేశ్వరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రత్యేక హోదా విభజన హామీలపై మోదీ ప్రకటన చేయాలి

● గోదావరి పరిరక్షణ సమితి కన్వీనర్ టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, మే 5: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజమహేంద్రవరం సభకు వస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి ఇవ్వాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని గోదావరి పరిరక్షణ సమితి కన్వీనర్, వైసీపీ నాయకుడు టీకే విశ్వేశ్వరరె డ్డి డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మిస్తామని, ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతి వెంకటేశ్వరస్వామి సాక్షిగా హామీ ఇచ్చిన ప్రధాని మోదీ మట్టి నీళ్లు ఇచ్చారని, పోలవరం ప్రాజెక్టు నిర్లక్ష్యం చేశారని, విశాఖ రైల్వే జోను ఏర్పాటు చేయలేదని వాటిపై సభలో మోదీ ప్రకటన చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎల్‌వి ప్రసాద్, డాక్టర్ రాజశేఖర్, రేగుళ్ళ బాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





జయం మనదే..

తుని సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ఓడిపోతామని తెలిసే వైసీపీ దాడులు

- కల్తీకి కేరాఫ్‌గా మారిన మంత్రి
- మట్టి, ఇసుక మాఫియాకు రాజా
- హేచరీకి రూ.10 లక్షల మామూళ్లు
- విలేకరిని హత్య చేయించారు
- రానున్నది కూటమి ప్రభుత్వమే
- జనసంద్రంగా మారిన తుని



ఫ్యాన్ గాలి తీసేయండి : సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

తుని రూరల్, మే 5 : కల్తీకి కేరాఫ్‌గా మారిన ఘనత తునికి చెందిన వైసీపీ మంత్రి దాడిశెట్టి రాజాకే దక్కిందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శించారు. కూటమి ఉమ్మడి అభ్యర్థుల ప్రచారంలో భాగంగా తుని పట్టణం గొల్ల అప్పారావు సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని, ఓడిపోతామని తెలిసే వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్యలకు మంత్రి దాడిశెట్టి రాజా పాల్పడ్డారని, పత్రికా స్వేచ్ఛను హరించి ఓ పత్రికా విలేకరిని దారుణంగా హత్య చేయించారన్నారు. తాండవ నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వి తరలించి సముద్ర తీరాన సముద్రపు ఇసుకను కలిపి కల్తీ ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. తీర ప్రాంతాల్లో రాష్ట్రానికి ఆదాయ వనరులుగా మారిన హేచరీల నుంచి రూ.10 లక్షలు మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సాగునీటి కాల్వలు గాలికి వదిలేసి రైతులను దెబ్బతీశారని ధ్వజమెత్తారు.తునిలో ప్రధాన సమస్య తాండవ రిటైనింగ్ వాల్ ఊసే లేదని, మట్టి మాఫియా నడిపిస్తూ కోట్ల రూపాయలు దండుకోవడమే మంత్రి పనిగా పెట్టుకున్నారన్నారు. మంత్రి ఇలాకాలోనే రోడ్లు దయనీయంగా మారాయని, మిగతాచోట్ల పరిస్థితి చెప్పనక్కరలేదన్నారు. తునిలో సమస్యలు పరిష్కారం అవ్వాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్న దివీస్ పరిశ్రమ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, మత్స్యకారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. దివీస్ సమస్యపై గతంలో తొండంగి మండలంలో పర్యటించి వారికి అండగా నిలిచినట్టు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాలుష్య రహిత పరిశ్రమల పనిపడతామన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం అభివృద్ధి చేస్తామన్నారు. పంపా, తాండవ రిజర్వాయర్లకు సంబంధించిన పంట కాల్వలు ఆధునికీకరించి రైతులను ఆదుకుంటామన్నారు. తుని రైల్వేస్టేషన్‌లో లోకల్ ట్రైన్స్ హాల్ట్‌కు చొరవ చూపి ఈ ప్రాంత వాసుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తుని అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటామని రానున్న ఎన్నికల్లో సైకిల్, గాజు గ్లాసు గుర్తులపై అమూల్యమైన ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంట సంక్షేమం వెల్లివిరుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. ముందుగా చామవరం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభ వేదిక వరకూ రోడ్ నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, తుని అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత, సుర్ల లోవరాజు, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, మోతుకూరి వెంకటేష్, యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు వీరేష్, చోడిశెట్టి గణేష్, బీజేపీ నేత చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొన్నారు.



వీరికే ఓటేయండి : కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్, తుని ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితను పరిచయం చేస్తున్న పవన్



పవన్‌ను కలిసిన ముద్రగడ కుమార్తె

తుని రూరల్ : తునిలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి, చందు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పవన్‌కల్యాణ్‌పై ముద్రగడ పద్మనాభం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జనసేనానికి మద్దతుగా మాట్లాడిన విషయం విదితమే. దీంతో వీరి కలయిక చర్చనీయాంశమైంది.



పవర్ స్టార్.. ప్రభంజనం : తునిలో జరిగిన పవన్ సభకు హాజరైన యువత

నేడు ప్రధాని మోదీ రాక

- రాజమహేంద్రవరం వేమగిరిలో కూటమి భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న పవన్, పురందేశ్వరి, లోకేశ్
- వేదిక, ఇతర ఏర్పాట్లు పూర్తి
- భారీ భద్రతా ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, మే5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. ఎన్‌డీఏ కూటమి భాగస్వాములుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ హాజరుకానున్నారు. 'విజయశంఖారావం' పేరుతో నిర్వహించే ఈ సభ 60 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. విశాలమైన సభావేదికలు ఏర్పాటు చేశారు. హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపం వరకూ హైవేకు రెండువైపులా బారికేడ్లు ఏర్పాటుచేశారు. వేమగిరి వైపు కూడా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసు భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తం ఈ ప్రాంతాన్ని ఎస్‌పీజీ స్వాధీనం చేసుకుంది. ప్రాంగణంలో 50 వేల మంది కూర్చోవడానికి కుర్చీలు వేస్తున్నారు. ప్రధానమంత్రి పాల్గొనే ఈ విజయశంఖారావం సభ వేదికపై మొత్తం 44 మంది ఆశీనులయ్యేటట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితోపాటు కాకినాడ, అమలాపురం, నర్సాపురం, ఏలూరు పార్లమెంటు అభ్యర్థులకు కూడా స్థానం కల్పించనున్నారు. వారితోపాటు ముఖ్యంగా రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులకు చోటు కల్పించనున్నారు. ఇంకా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ముఖ్య నేతలకు కూడా అవకాశం కల్పిస్తారు.



వేమగిరిలో మోదీ పాల్గొనే సభా వేదిక ఏర్పాట్లు

ప్రధాని రాక ఇలా..

ప్రధాని నరేంద్రమోదీ సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట 35 నిమిషాలకు ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ ఎయిర్‌పోర్టు నుంచి ఐఏఎఫ్ ఎంబ్రేయర్ మీద బయలుదేరి 2.25 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.30 గంటలకు ఎం.ఐ 17 హెలికాప్టర్ మీద 2.50 గంటలకు వేమగిరిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు వస్తారు. అక్కడ నుంచి 2.55 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3 గంటలకు సభావేదిక వద్దకు వస్తారు. అక్కడ 3 గంటల నుంచి 3.45 గంటల వరకూ అంటే మొత్తం 45 నిమిషాలపాటు వేదిక మీద ఉంటారు. 3.45కు బయలుదేరి రోడ్డు మార్గాన 3.55 గంటలకు హెలిపాడ్‌కు చేరుకుంటారు. హెలికాప్టర్‌లో అనకాపల్లి వెళతారు.

గాలి వీస్తోంది!

కూటమి వైపే 'గోదారి' పవనాలు



(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

- అధినేతల చూపంతా ఇక్కడే
- గోదావరి జిల్లాలను జల్లెడ పడుతున్న పార్టీలు
- రోజు ఏదొక అధినేత ఈ జిల్లాల్లోనే పర్యటన
- టీడీపీ అధినేత చంద్రబాబు సుడిగాలి పర్యటనలు.. దూకుడు పెంచేలా వ్యూహాలు
- జనసేన అధినేత సైతం ఉమ్మడి జిల్లాపైనే దృష్టి
- అన్ని నియోజకవర్గాలనూ చుట్టేస్తున్న పవన్
- పిఠాపురంలో బరిలోనూ 'వారాహి' స్పీడు
- రాజమండ్రి ఎంపీ బరి నుంచి పురందేశ్వరి
- రాష్ట్ర అధ్యక్షురాలిగానూ దిశానిర్దేశం
- కూటమి అభ్యర్థుల జోరుతో వైసీపీ డీలా
- ఇప్పటికే జగన్ పర్యటించినా కలసిరాని వైనం
- మోదీ సభతో ఇక 'విజయశంఖారావమే'

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు అనూహ్యమైన తీర్పు ఇవ్వబోతున్నట్టు గోదావరి తీరంలోని జనంనాడి చెబుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైపు గాలి వీస్తుండడంతో ఆయా పార్టీల్లో జోష్ పెరిగింది. 2019లో ఇక్కడ వైసీపీ ఫ్యాన్ గాలితో దూసుకెళ్లింది. ఈసారి గోదావరిలో సహజమైన గాలి వీస్తోంది. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అస్తవ్యస్థ విధానాలు, అవినీతి, అరాచకం, శాంతిభద్రతలు మృగ్యంకావడం, వేధింపు ధోరణులు, ప్రకృతి వనరుల దోపిడీ.. అభివృద్ధి లేకపోవడం, నిరుద్యోగం.. ఇలా సవాలక్ష సమస్యల్లో జనం చిక్కుకుపోయారు. అసలు పథకాలన్నీ మూలనపడేసి, కొన్ని సంక్షేమాల పథకాల పేరిట బటన్ నొక్కినా, అవి ప్రజలకు ఎప్పుడు చేరతాయో కూడా తెలియని గందరగోళం మధ్య ఐదేళ్లు గడిచింది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి.. సామాన్య మధ్యతరగతి ప్రజల జీవనం కూడా దుర్భరమైన స్థితిని చవిచూశారు. కరెంటు చార్జీలు, పన్నుల పేరిట సాగించిన ప్రభుత్వం అన్ని వర్గాలపై ఎనలేని భారం మోపింది. నరకప్రాయమైన రోడ్లు, అభివృద్ధి లేమితో ప్రజలు పడినపాట్లు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలో అభివృద్ధి అనేది ఎక్కడా ప్రచారం చేసుకోలేని దుస్థితిలో వైసీపీ ఉంది. ఈసారి సంక్షేమం అనే ఒక్క మాటనే పదేపదే వల్లెవేస్తూ జగన్ బటన్ నొక్కిన కార్యక్రమాన్ని ప్రచారం చేస్తోంది. మరోవైపు ఆ పార్టీ మేనిఫెస్టో కూడా తుస్సుమనడంతో కేడర్ మరింత డీలా పడింది. ఇటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి గోదావరి జిల్లాల్లో జనం బ్రహ్మరథం పడుతుండడం వైసీపీ నేతల్లో వణుకుపుట్టిస్తోంది. శాంతిభద్రతలు కాపాడడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన ప్రజామేనిఫెస్టోను కూటమి విడుదల చేయడంతో మంచి స్పందన వచ్చింది. మరోవైపు టీడీపీకి కంచుకోటలాంటి గోదావరి జిల్లాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మొదటి నుంచి ప్రత్యేక దృష్టి పెట్టారు. వైసీపీ కుట్ర వల్ల చంద్రబాబు 53 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా మగ్గిపోయిన సమయంలో ఆయన కుటుంబ సభ్యులంతా రాజమహేంద్రవరంలోనే మకాం ఉండి ప్రజలతో కలసి ఉండిపోయారు. చంద్రబాబుకు ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభించడంతోపాటు ఆయన గొప్పతనం ప్రజలకు బాగా అర్థమైంది. అంతకుముందే గత ఏడాది మే నెలలో రాష్ట్ర స్థాయి టీడీపీ మహానాడును ఇక్కడే నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలనూ ఇక్కడి నుంచే ప్రకటించారు. మహానాడు కూడా గోదావరి జిల్లాల్లో మరింత జోష్‌ను పెంచింది. టీడీపీ-జనసేన పొత్తు కూడా రాజమహేంద్రవరంలోనే పొడవడం, నేరుగా పవన్‌కల్యాణ్ ఇక్కడి నుంచే ప్రకటించడమేగాకుండా తొలి భేటీ కూడా ఇక్కడే నిర్వహించడం రాజకీయ సంచలనాలకు దారితీసిందనే చెప్పాలి. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు గోదావరి జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నికల ప్రకటన తర్వాత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రధానంగా గోదావరి జిల్లాలపైనే దృష్టి పెట్టారు. గోదావరి జిల్లాల్లో గాలి ఎటుంటే అదే పార్టీ అధికారంలోకి వస్తుందనేది ఎన్నోసార్లు రుజువైంది. దీంతో గోదావరి జిల్లాల్లో గెలుపే ప్రధానంగా ఇటు కూటమి, అటు వైసీపీ కూడా సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్నాయి. ప్రతిరోజూ ఏదొక అధినేత గోదావరి జిల్లాల్లో పర్యటిస్తుండడమే దీనికి ఉదాహరణ. సీట్ల కేటాయింపులో టీడీపీ, జనసేన మధ్య కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడినా.. ఊహించని విధంగా ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఈ రెండు పార్టీల కేడర్లు ఎంతో పట్టుదలగా కలసి పనిచేస్తున్నాయి. గత ఎన్నికల్లో జనసేన కూడా గోదావరి జిల్లాల్లో గణనీయమైన ఓటుబ్యాంకును సాధించుకోవడంతో ఇప్పుడు కూటమికి మరింత బలం చేకూరిందని టీడీపీ, జనసేన అభ్యర్థులు గణాంకాలతో సహా చెబుతున్నారు. మరో రెండు ఆసక్తికరమైన అంశాలు ఏమంటే.. రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ, జనసేన అధినేతలు పురందేశ్వరి, పవన్‌కల్యాణ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే పోటీ చేస్తుండడం ఈ ప్రాంతంలో ప్రభావితం చూపుతుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా పిఠాపురం నుంచి పోటీచేస్తున్న పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గంతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరిని ప్రభావితం చేసేలా పూర్తిస్థాయిలో తన పర్యటనలను రూపొందించుకోవడం వ్యూహాత్మకమే. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్.. గోదావరి జిల్లాల ఫలితాలను పూర్తి స్థాయిలో ప్రభావితం చేసేలా ఎన్నికల ప్రచారాలను సాగిస్తున్నారని ఆ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విజయావకాశాలపైనా అందరి దృష్టి ఉంది. ఆమె తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులతో కలసి పెద్దఎత్తున ప్రచారం సాగిస్తూ విజయానికి చేరువవుతున్నారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగానూ ఇక్కడి నుంచే దిశానిర్దేశం చేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా రాజకీయ ఉద్ధండులంతా గోదావరి జిల్లాలపై పూర్తిగా దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది. వైసీపీ అధినేత జగన్ కూడా ఎక్కువసార్లు గోదావరి జిల్లాల్లో పర్యటించే విధంగానే తన రూటు మ్యాప్‌ను రూపొందించుకుంటున్నారు. బస్సు యాత్ర ద్వారా, తర్వాత అంబాజీపేటలో ఎన్నికల ప్రచారానికి ఇప్పటిదాకా రాగా, ఆయా జగన్ సభలు అనుకున్నవిధంగా విజయవంతంకాకపోవడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 7న కోరుకొండలో ఎన్నికల ప్రచారసభ కోసం మరోసారి జగన్ రాబోతున్నారు. మొత్తానికి వైసీపీ గోదావరి జిల్లాల్లో ఈసారి వ్యతిరేక పవనాలు వీస్తుండడం వైసీపీ అభ్యర్థులను కలవరానికి గురిచేస్తోంది. ఎన్‌డీఏ కూటమి తరపున ప్రచారానికి సోమవారం రాజహేంద్రవరం వస్తున్న ప్రధాని మోదీ విజయశంఖారావం పూరించి.. దూకుడు పెంచనున్నారు.

కొవ్వూరులో నారా రోహిత్ ప్రచారం

కొవ్వూరు, మే 5 :కొవ్వూరులో సినీ హీరో నారా రోహిత్ ఆదివారం కూటమికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున ప్రచారంలో పాల్గొన్నారు. కొవ్వూరు పట్టణం, వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, బంగారం పేట వరకు ప్రచారం చేశారు. భావితరాల భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధి కోసమే కూటమి ఏర్పడిందన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.



నేను ఇక్కడి వాడినే.. సమస్యలపై అవగాహన ఉంది..



నేను ఇక్కడే పుట్టాను.. ఇక్కడే పెరిగాను.. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలేంటో నాకు తెలుసు.. అన్నింటిని పరిష్కరించాలనేదే నా లక్ష్యం.. ఆ దిశగా నాకో ప్రణాళిక ఉంది.. ఇప్పటి వరకూ వెనుకబడి ఉన్న నియోజకవర్గంగా పేరుగాంచింది.. ఇక నుంచి అలా కాదు.. అన్నింటా ముందుండాలనేదే నా ఆకాంక్ష.. అభివృద్ధికి అవకాశం ఉన్న నియోజకవర్గం గోపాలపురం.. నాకు చిన్నతనం నుంచి ఆ విషయం తెలుసు.. ఇప్పుడు నాకో అవకాశం వచ్చింది.. ప్రజలు ఓటేసి విజయం అందిస్తే ఐదేళ్లలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా.. ఇప్పటికే విలేజ్ మేనిఫెస్టో రూపొందించుకున్నానన్న గోపాలపురం కూటమి టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజుతో ఆంధ్రజ్యోతి ప్రతినిధి చిట్‌చాట్.. - వివరాలు 6లో

బీసీలకు ద్రోహం చేసిన జగన్

బీసీల సమావేశంలో రెడ్డి సుబ్రహ్మణ్యం



బీసీల ఆత్మీయ సమావేశంలో సమైక్య నినాదం చేస్తున్న బీసీ నాయకులతో పురందేశ్వరి, ఆర్ఎస్, ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 5 : జగన్ రెడ్డి రాష్ట్రంలో బీసీలకు ద్రోహం చేశాడని అన్నివ్యవస్థలను భ్రష్టుపట్టించి కేవలం దోచుకోవడం దాచుకోవడమే నినాదంగా దగా చేశాడని శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాజమహేంద్రవరం కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్ సమీపంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శెట్టిబలిజ గౌడ ఆత్మీయ సభలో ఆయన మాట్లాడారు. బీసీలను గుర్తించి రిజర్వేషన్లు అందించింది అన్న ఎన్టీఆర్ అన్నారు. అదే స్ఫూర్తిని చంద్రబాబు ముందుకు తీసుకువచ్చారని చెప్పారు. బీసీలలో కులవృత్తులను ఆదుకుని అభివృద్ధి చేసింది టీడీపీ ప్రభుత్వమన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే బాధ్యత బీసీ కులగణన చేసే బాధ్యతలను పురందేశ్వరి తీసుకోవాలన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక 50 శాతం వర్కులు బీసీ కులాలకు చెందిన వారికే ఇస్తానన్నారు. ఎంతమంది బీసీలకు వర్కులు అప్పగించారో జగన్ చెప్పాలన్నారు. రాష్ట్రంలో దండుకో అనే ఏకైక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. ఏదైనా పార్టీ అధికారంలోకి వస్తే నిర్మాణాత్మక పనులతో పరిపాలన చేయాలని, కానీ ఈ రోజు అవినీతిపాలన, విధ్వంసం పాలన చూస్తున్నామన్నారు.రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోవడం సిగ్గుచేటు అన్నారు. బీసీలలో ఉపకులాలలకు కార్పొరేషన్లు పెట్టి చిచ్చుపెట్టారన్నారు.నాణ్యతలేని మద్యం పేదలతో తాగించి వారి ఆరోగ్యాలతో ఆటలాడుకుంటూ జేబులను నింపుకున్నది జగన్ కాదా అని ప్రశ్నించారు. కేంద్రం 22 లక్షల ఇళ్ల నిర్మాణం చేయమంటే నిర్మించలేదన్నారు. పేదవారెవరు బెంగళూరు, హైదరాబాద్‌లలో ప్యాలెస్‌లుఉన్న వారా అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించడానికి ముందుకువచ్చారని చెప్పారు. మూడుపార్టీల వెనుక మోదీ స్ఫూర్తి, చంద్రబాబు యుక్తి, పవన్ శక్తి కలిసి ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డా యన్నారు. 14 లక్షల కోట్లు అప్పు భారం రాష్ట్రంపై ఉంద న్నారు. మనది ట్రిబుల్ ఇంజన్ సర్కార్ అన్నారు. నన్నయ, కందుకూరి, ప్రకాశం పంతులు నడయాడిన నేల ఈ రోజు బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డాగా మారిందన్నారు. ఇలాంటి వైసీపీ ప్రజాప్రతినిధులు మనకు కావాలా అని ప్రశ్నించారు. గోదావరి ప్రక్షాళన చేయాలని రూ. 50 కోట్లు ఇస్తే రెండు రోడ్లు , ఒక హ్యాపీ స్ట్రీట్ నిర్మాణం చేసి ఇదే అభివృద్ధి అంటున్నారంటే మనల్ని ఎంత తక్కువ అంచనా వేస్తున్నారో ఆలోచించాలన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పాటు ఏడుగురు కూటమి అభ్యర్థు లను గెలిపించాలన్నారు. రాజమహేంద్రవరం సిటీ కూట మి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పకుండా బీసీల ఐక్యత కోసం అందరు కలిసి కట్టుగా వెళ్లాలన్నారు. సభను విజయంతం చేసిన శెట్టిబలిజ గౌడ శ్రీనైన, యాత సంఘీలం దరికీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు ధన్యవాదాలు తెలిపారు. ఐక్యతను చాటి కూటమిని అధికారంలోకి తీసుకువస్తున్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో రెడ్డి మణేశ్వరరావు ,అమలాపురం టీడీపీ పార్లమెంట్ అధ్యక్షురాలు రెడ్డి అనంతలక్ష్మి, బుడ్డిగ రాధా, కట్టా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సూరంపూడి శ్రీహరి, బీసీ సెల్ నగర్ అధ్యక్షుడు బుడ్డిగ రవి, చింతలపల్లి నాని, కడలి రామకృష్ణ, కడలి వెంకటేశ్వరావు, చంటి, డి.నాగేశ్వరరావు, సత్తిబాబు,బుజ్జి, పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి

విలేజ్ మేనిఫెస్టో



నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాలనేది లక్ష్యం

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

నల్లజర్లలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తాం

ఆంధ్రజ్యోతితో

గోపాలపురం ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు

ప్రశ్న: ప్రస్తుతం ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది ?

జ: గోపాలపురం నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలోనూ పర్యటించి ప్రతి ఓటరును కలుస్తున్నాం. ఎన్నికల ప్రచారంలో కూటమి పక్షాలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నారు.

ప్రశ్న: ఏ వర్గాల ప్రజలు ఎలా స్పందిస్తున్నారు ?

జ: అన్ని వర్గాల ప్రజల నుంచి కూటమికి స్పందన విశేషంగా కనిపిస్తుంది. గ్రామాల్లో పర్యటించేటప్పుడు వస్తున్న ఆదరణ అనూహ్యంగా ఉంది.

ప్రశ్న: మీకున్న గెలుపుకు అవకాశాలు ఏంటి ? ఎందుకంత ధీమా ?

జ: ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోపాటు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి నా గెలుపుకు నాంది.

ప్రశ్న: ఇక్కడ మెజారిటీ వర్గాల కోసం మీరు ఏం చేయబోతున్నారు ?

జ: తెలుగుదేశం పార్టీ ఇప్పటికే మేనిఫెస్టో విడుదల చేసింది. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని నిర్ణయించాం. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీలు, సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి చొచ్చుకుపోయాయి.

ప్రశ్న: గత పాలకుల హయాంలో జరిగిన అన్యాయం ఏంటి ?

జ: గత పాలకులు అన్ని వర్గాలను విస్మరించారు. వర్గ వ్యతిరేకాలతో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యంగా మారింది. ఇక్కడి ఎమ్మెల్యే అవినీతికి మారు పేరుగా మారారు. ఇసుక, మట్టి దోపిడీ చేశారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురి చేశారు. రైతులను ఆర్థికంగా కృంగదీశారు. ఏ మండలంలో చూసినా షాడో ఎమ్మెల్యేలు అవినీతికి తెరలేపారు. అందుకే ప్రజలు ఈ ప్రభుత్వాన్ని సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారు.

ప్రశ్న: ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఏం చేయబోతున్నారు ?

జ: ప్రజలందరికీ అందుబాటులో ఉంటా. నాలుగు మండలాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తా.

ప్రశ్న: గెలిచాక ఏ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తారు ?

జ: విజయం సాధించిన తర్వాత ఈ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాలనే లక్ష్యంతో ఒక ప్రణాళిక కూడా రూపొందించుకున్నాను. ముఖ్యంగా పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ నియోజకవర్గ ముఖద్వారమైన నల్లజర్లలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని నిర్ణయించాం. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువత కోసం పరిశ్రమలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రతి గ్రామానికి విలేజ్ మేనిఫెస్టో రూపకల్పన చేయాలని నిర్ణయించాం. గ్రామాల్లో చేయబోయే అభివృద్ధి, గ్రామంలోని సమస్యలను తెలియజేస్తూ ప్రతి గ్రామంలో వాటిని ప్రదర్శించే బోర్డులు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది ?

జ: కూటమి పార్టీల సహకారం మెరుగ్గా ఉంది. ఇప్పటికే ఎంపీ అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియోజకవర్గంలో పర్యటించారు. మా పార్టీ శ్రేణులతో పాటు కూటమికి చెందిన జనసేన, బీజేపీ నాయకులు నా విజయం కోసం శ్రమిస్తున్నారు.

ప్రశ్న: ప్రచారంలో మీ కుటుంబ సభ్యుల సహకారం ఎలా ఉంది ?

జ: ఎన్నికల ప్రచారంలో మా కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, శ్రేయోభిలాషులు నా విజయానికి నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

-గోపాలపురం

మహిళలపై నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా రాజమండ్రి రక్షాదళం

రాజమహేంద్రవరం అర్బన్, మే 5: మహిళలపై నేరాల నియంత్రణకు సంబంధించి మేనిఫెస్టోలో ప్రత్యేకంగా రూపొందించిన రాజమండ్రి రక్షాదళం డిక్లరేషన్‌ను బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఆవిష్కరించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో ఈమేరకు డిక్లరేషన్‌ను విడుదల చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ మహిళల రక్షణ తమ బాధ్యత అని అన్నారు. కాగా, పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు రాజమహేంద్రవరంలోని రాజస్థానీలు, గుజరాతీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబాటు

టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మే 5: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన దొమ్మేరులో ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు హరతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. పిల్లల భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధికి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు కూటమి అభ్యర్థులకు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కాకర్ల వంశీ, దండమూడి శేషు, దత్తుడు, మద్దుకూరి పెద్దబ్బులు, ఓలేటి హరేరామ్ పాల్గొన్నారు. పెద్దేవంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు కుమారుడు ధరణ్ ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో బోడపాటి కాశీ, బిగంగరాజు, కోడి శంకరం, పడమట కృష్ణ, నామన బురయ్య పాల్గొన్నారు. అలాగే వేగేశ్వరపురం, ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా టీడీపీ నాయకులు మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కైగాల శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు నామాన పరమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నామన్నారు. ర్యాలీలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, బూసి బెనర్జి, కిలాని రమణ, ఐతం మణికంట, దేవన సత్యనారాయణ, కొట్నీస్ పాల్గొన్నారు.



దొమ్మేరులో ముప్పిడి వెంకటేశ్వరరావుకు హారతులిస్తున్న మహిళలు

కోట సత్తెమ్మకు పూజలు



నిడదవోలు, మే 5: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజా టికెట్ల ద్వారా రూ.1,05,069 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ఆవరణలో సమిశ్రగూడెం గ్రామానికి చెందిన గోదావరి స్టీల్స్ అధినేత ముళ్లపూడి శ్రీనివాసరావు 150 లీటర్ల పెరుగును మజ్జిగ చలివేంద్రానికి అందజేశారు.

ప్రధాని మోదీ పర్యటనకు అత్యంత పటిష్ఠ భద్రత

- పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు భారీగా మోహరింపు
- అణువణువూ జల్లెడ పడుతున్న తనిఖీ బృందాలు
- పార్కింగ్‌లోనే వాహనాలు నిలపాలి: ఎస్పీ జగదీశ్



సభా ప్రాంగణం వద్ద తనిఖీలు చేస్తున్న డాగ్‌స్క్వాడ్

రాజమహేంద్రవరం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రాక సందర్భంగా అత్యంత పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సభా ప్రాంగణం, హెలీప్యాడ్ తదితర ప్రదేశాలను ఎస్‌ఎస్‌జీ తమ ఆధీనంలోకి తీసుకొంది. పెద్ద సంఖ్యలో పోలీసులను, కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. తనిఖీ బృందాలు అణువణువునూ జల్లెడ పడుతున్నాయి. ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలని, ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని ఎస్పీ జగదీశ్ సూచించారు. అటు విజయవాడ, ఇటు విశాఖ వైపు నుంచి వచ్చే వాహనాల కోసం వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు విశాలంగా ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులను గమనించుకుంటూ ప్రయాణించాలని చెప్పారు.పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

1గంటకే సభా ప్రాంగణానికి చేరుకోవాలి

ప్రధాని మోదీ చేరుకొనే హెలీప్యాడ్‌ల నుంచి సభా ప్రాంగణానికి హైవేతో కలుపుకొని 1.6కిలోమీటర్ల దూరం ఉంది. మధ్యాహ్నం 1గంట తర్వాత ఈ మార్గంతోపాటు వేమగిరి జంక్షను నుంచి సభా వేదిక వద్దకు చేరుకునే మార్గాలను భద్రతా బలగాలు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటాయి. వాహనాలను, ప్రజలను అనుమతించరు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. తీవ్రమైన ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. అందువల్ల మధ్యాహ్నం 1గంటలోపుగానే సభా ప్రాంతానికి చేరుకొని నిర్దేశిత ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసి వేదిక వద్దకు ప్రజలు చేరుకోవాలని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే..

రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లు దాటిన తర్వాత ఎడమవైపు పార్కింగ్ నెం.7, 8లో నిలుపుకోవాలి. కాస్త ముందుకు వెళ్లిన తర్వాత కూడా ఎడమవైపు కార్లు(నెం.6), ఆ వెనుక 4ఏ, 4బీ ప్రదేశాల్లో బస్సులు పార్క్ చేయాల్సి ఉంటుంది. కుడివైపున పార్కింగ్ నెం.5లో కార్లు, బస్సులు నిలపాలి. అలాగే వేమగిరి జంక్షను వైపు నుంచి వచ్చే వాహనాల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు ఎడమవైపున పార్కింగ్ నెం.2లో పెట్టాలి. కుడివైపున కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ నెం.1లో, ఈ పార్కింగ్ వెనుక పార్కిగ్ నెం.3లో బస్సులు నిలపాల్సి ఉంటుంది. వీవీఐపీ పాసులు ఉన్న వాహనాలను 4ఏ పార్కింగ్‌లో నిలపాలి. డయాస్ పాస్ ఉన్నవారు మీటింగ్ ప్రాంతంలో దిగి వారి వాహనాలను వేమగిరి జంక్షను దగ్గరలోని విందు రెస్టారెంట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో పెట్టాలి. మధ్యాహ్నం 2గంటల నుంచి ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ, వేమగిరి జంక్షను నుంచి క్వారీ కెనాల్ రోడ్డు పీవీఆర్ ఎస్టేటు వద్ద ఏర్పాటు చేసి పార్కింగ్ నెం.5కి వాహనాలను మళ్లిస్తారు.



హెలీప్యాడ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

మార్గదర్శకుడు కార్ల్‌మార్క్స్



సమావేశంలో మాట్లాడుతున్న పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్

దేవరపల్లి, మే 5: ప్రపంచ మానవాళికి మార్గదర్శకుడు కార్ల్‌మార్క్స్ అని ప్రగతిశీల కార్మిక సమాఖ్య(పీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ అన్నారు. మండలం దుద్దుకూరులో పీకేఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ కమ్యూనిస్టు సిద్ధాంత కర్త కార్ల్‌మార్క్స్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఎస్కే మస్తాన్ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకం కండి పోరాడితే పోయేది ఏముంది బానిస సంకెళ్ళు తప్ప ఆయన నినదించిన మొదటి వ్యక్తి కార్ల్‌మార్క్స్ అని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులు హరిస్తోందని, అటవీ సంపదను అంబానీ, అదానీలకు అప్పజెప్పడానికి చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో ఆదివాసీలపై మారణకాండ జరుపుతున్నారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే.కృష్ణ, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేలంగి చిట్టిబాబు, కేఎన్‌బీఎన్ జిల్లా అధ్యక్షుడు జాన్‌రాజు పాల్గొన్నారు.

డి.ముప్పవరంలో యువకుడి ఆత్మహత్య

నిడదవోలు, మే 5: నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామానికి చెందిన ఎమ్.సతీష్ (31) కుటుంబ కలహాల కారణంగా ఆదివారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

దేవరపల్లి, మే 5: ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో జరిగిన దాడుల్లో నల్లజర్ల మండలం అనంతపల్లిలో 10మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. గోపాలపురం మండలం సాగిపాడులో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్ఐ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు సూర్యప్రకాశరావు భార్య మృతి

రాజమహేంద్రవరం కల్చరల్, మే 5: స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత సూర్యప్రకాశరావు భార్య వెంకట రత్నాంబ(99) ఆదివారం హైదరాబాదులో తుది శ్వాస విడిచారు. రత్నాంబ గౌతమీ టైమ్స్ ఎడిటర్ శివరామ్ తల్లి. కాగా ఆమెకు నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. ఆఖరి మనుమడు పవన్‌కాంత్ ఢిల్లీలో బీబీసీ న్యూస్‌లో జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు.

పద్మశాలి సంక్షేమ సంఘం నిడదవోలు అధ్యక్షుడిగా నాగేంద్ర



అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నాగేంద్ర

నిడదవోలు, మే 5: సమాజంలోని అన్ని కుల సంఘాలకు పద్మశాలీల సంక్షేమ సంఘం ఆదర్శంగా నిలవాలని సంఘం నూతన అధ్యక్షుడు నీలం నాగేంద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ ఆడిటోరియమ్‌లో నిడదవోలు పద్మశాలీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఈమంది కన్నారావు, విశిష్ట అతిథిగా ఆమంచి ఆంజనేయ గురుస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ప్రసాద్ మాట్లాడుతూ పద్మశాలీలంతా ఏకతాటిపైకి వచ్చి సంఘాభివృద్ధికి భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన తంగెళ్ల కోటేశ్వరరావుకు, 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ప్రతిమకు నగదును అందజేశారు. సంఘాభివృద్ధికి కృషి చేసిన పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండారు రాంబాబు, కోశాధి కారి ఎంవీవీ సత్యనారాయణ, నీలం గణపతి శ్రీనివాసరావు, కొప్పుల కాశీపతిరావు, నందం వీర్రాఘవులు, మల్లుల కామరాజు, బొజ్జా పాపారావు పాల్గొన్నారు.

జంపింగ్ అభ్యర్థులా.. నాకు పోటీ ?

గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి



రాళ్లకుంటలో నారా రోహిత్, మద్దిపాటి ప్రచారం

ద్వారకాతిరుమల, మే 5: 'పక్క నియోజకవర్గాల్లో ఓడిపోయే అభ్యర్థులు ఇక్కడ మనకు ప్రత్యర్థులు.. వీళ్లు నాయకులు.. ఇటువంటి వాళ్లతో మనం పోటీపడాలి. 2009లో ఇక్కడ ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేను చేస్తే 2014కు కొవ్వూరు జంప్ అయ్యారు. అక్కడి ప్రజలు గెలిపిస్తే 2024కు మళ్లీ ఇక్కడకు జంప్.. నిలకడలేని మీరా రాజకీయాలు చేసేది' అంటూ హోంమంత్రి వనితను గోపాలపురం నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు ఎద్దేవా చేశారు. మండలంలోని సత్తాల, పి.కన్నాపురం, మలసానికుంట, రాళ్లకుంట, కొమ్మర, కోడిగూడెం, ఐఎస్ రాఘవాపురం, జగన్నాథపురం తదితర గ్రామాల్లో ఆయన పార్టీ ప్రచారాన్ని నిర్వహించారు. రాళ్లకుంట, సత్తెన్నగూడెం గ్రామాల్లో సినీ హీరో నారా రోహిత్‌తో కలసి ఆయన ప్రచారాన్ని సాగించారు.

మోడల్ నియోజకవర్గంగా నిడదవోలు

● టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు అభ్యర్థి దుర్గేష్



విజ్జేశ్వరంలో ప్రచారం నిర్వహిస్తున్న కందుల దుర్గేష్

నిడదవోలు, మే 5: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిడదవోలు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు మండలం విజ్జేశ్వరం, పందలపర్రు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలు విసిగిపోయారని, సంక్షేమంతో పాటు అభివృద్ధిని అందించగలిగిన కూటమికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గ్రామాల నుంచి పట్టణం వరకు, సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు ప్రతి ఒక్కరూ అడుగడుగునా తనకు మద్దతునిస్తూ అండగా నిలుస్తున్నారని దుర్గేష్ అన్నారు. నియోజకవర్గాన్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డీవీ కృష్ణారావు, డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి, బూరుగుపల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని కె.సావరంలో ఆదివారం సాయంత్రం కందుల దుర్గేష్ కుమార్తె ఈలి రంగప్రియ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. తన తండ్రిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మహిళలు, అన్ని వర్గాల ప్రజలకు రానున్న కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు, సర్పంచ్ నార్ని రామకృష్ణ, ఎంపీటీసీ కాకర్ల కరుణాకర్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం, కొవ్వూరు పర్యాటకంగా అభివృద్ధి

ఎంపీ స్వతంత్ర అభ్యర్థి రాఘవేంద్రరావు



కొవ్వూరు, మే 5: రాజమహేంద్రవరం, కొవ్వూరు పట్టణాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని రాజమహేంద్రవరం పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థి సాలోపంతుల రాఘవేంద్రరావు అన్నారు. ఆదివారం కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కలగా ఉన్న భద్రాచలం రైల్వేలైను పనుల ప్రారంభించి పూర్తిచేయడంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తానన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యం, విద్య, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్‌కు కృషి చేస్తానని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కారానికి ఈ సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో సీసీ కెమెరాపై ఓటువేసి తనను గెలిపించాలన్నారు.

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ముఖ్య వైద్యాధికారిగా ప్రమీల

రాజమహేంద్రవరం రూరల్, మే 5: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ ఎంవీఎల్ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జిల్లా కమిషన్ చైర్మన్ లింగంపల్లి నాగ మణికంఠ ఇద్దరిని నియమించారు. ఈ కమిషన్ ముఖ్యవైద్యాధికారిగా డాక్టర్ కండ్రేగుల పమీల, జిల్లా ఆర్‌టీఐ ఇన్‌చార్జిగా కొమ్మశెట్టి ఆది వరప్రసాద్‌లను నియమించి నియమకపత్రాలు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకై కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మాలిన శివకుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ఎ.సంతోష్ కృష్ణ, ఎ.సతీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు



శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ అభ్యర్థులకు దిష్టి తీస్తున్న మహిళ

రాజమహేంద్రవరం సిటీ, మే 5: రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గిడుగు రుద్రరాజును, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోడా వెంకట్‌లను గెలిపించాలని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరంలో గోరక్షణ పేట, గానుక వీధి తదితరు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రచారం చేశారు. తొమ్మిది గ్యారెంటీలతో ప్రజలకు మంచి భవిష్యత్తును అందించే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో వారికి మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరు: దొమ్మేరులో ఎమ్మెల్యే అభ్యర్థి అరిగెల అరుణకుమారి ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పథకాలను వివరించారు. బాబు జగ్జీవన్‌రామ్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు నివాళులర్పించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా గిడుగు రుద్రరాజుకు హస్తం గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కొణిదల శ్రీనివాసరావు, సీతా వెంకటేశ్వర్లు, ముదునూరి కృష్ణంరాజు, కలగర చంద్రరావు, సిరవరపు సుబ్రహ్మణ్యం, కలగర వెంకట్రావు, పేరిచర్ల బాలకృష్ణంరాజు, సోయారాజు, కొక్కిరిపాటి సురేష్ పాల్గొన్నారు.